ప్రజాశక్తి

బుధవారం 23 నవంబర్ 2022

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

'ఉక్కు'ను కాపాడుకుంటాం

- నినదించిన విశాఖ ప్రజానీకం
- 600 రోజులకు చేరిన అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి దీక్షలు
- భారీ నిరసన, మోడీ ఫ్లెక్సీ దగ్ధం

దీక్షా శిబిరం వద్ద సభను ఉద్దేశించి మాట్లాడుతున్న జగ్గునాయుడు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కేంద్రం మెడలు వంచైనా విశాఖ ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షించుకుంటామన్న నినాదంతో జివిఎంసి పరిసర ప్రాంతాలు హోరెత్తాయి. సేవ్ వైజాగ్ స్టీల్ నినాదం ప్రజ్వరిల్లింది. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా కాపాడటానికి సుదీర్ఘకాలంగా పోరాటం సాగుతోందని, అయినప్పటికీ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దిగిరాని పరిస్థితి ఉందని, ఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవడానికి రాష్ట్రంలోని బిజెపి నాయకులు, ప్రజాప్రతినిధులు వారి పదవులకు రాజీనామా చేసి ఉద్యమంలోకి రావాలని, రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసిపి అన్ని రాజకీయ పార్టీలను కలుపుకొని కేంద్రం మెడలు వంచి స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవడానికి ప్రయత్నించాలని అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 600వ రోజుకు చేరుకున్న సందర్భంగా దీక్షా శిబిరం వద్ద వందలాది మంది నల్ల వస్త్రాలను ధరించి, నల్లజెండాలతో నిరసన తెలిపారు. శిబిరానికి ఎదురుగా ఉన్న రోడ్డుపై పెద్ద ఎత్తున రాస్తారోకో నిర్వహించారు. ప్రధాని మోడీ ఫ్లెక్సీని దగ్ధం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, ఐఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి మంత్రి రాజశేఖర్ మాట్లాడారు. మోడీకి ఎపి రాష్ట్ర ప్రయోజనాలు పట్టడం లేదన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేందుకు ప్రయత్నించడం దారుణమన్నారు. పార్లమెంటులోపల రాష్ట్రానికి చెందిన ఎంపీలు పోరాడటంతో పాటు రాష్ట్రంలోని ప్రజానీకాన్ని అన్ని రాజకీయ పార్టీలు కదిలించాలన్నారు. ప్రజా పోరాటంగా ఉద్యమాన్ని మలిచేందుకు మిగతా 2లో..

జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

సమస్యలపై యుటిఎఫ్ ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని యుటిఎఫ్ విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎ.నాగమణి, విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, తాడాన అప్పారావు, అనకాపల్లి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.లక్ష్మి, గొంది చినబ్బాయి, అల్లూరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు విల్సన్ బాబు, పి.మహేష్ మీడియాతో మాట్లాడుతూ పిఎఫ్ బకాయిలు (లోన్లు క్లోజర్స్), డిఎ బకాయిలు చెల్లించాలన్నారు. సిపిఎస్ బకాయిలు, పిఆర్‌సి డిఎ బకాయిలను తక్షణమే ఇవ్వాలన్నారు. ఎపిజిఎల్ఐ, లోన్లు, క్లోజర్స్ జాప్యాన్ని నివారించాలన్నారు. సరెండర్ లీవ్ బిల్లులను చెల్లించాలని కోరారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలన్నారు. ప్రభుత్వం దిగి రాకపోతే ఈ నెల 30న రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు.

డ్రగ్స్ కేసులో నిందితుడు అరెస్ట్

వార్త 3లో..

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పర్యటనపై నిరసన

వార్త 5లో..

వైసిపివి ప్రజావ్యతిరేక విధానాలు

వార్త 5లో..

నిర్వాసిత రైతులు అంగీకరిస్తున్నా..

పెట్రో వర్సిటీ పనులు ప్రారంభించరేం ?

సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం

ప్రజాశక్తి - అనకాపల్లి

పెట్రో యూనివర్సిటీ నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని, భూ నిర్వాసితులకు చట్ట ప్రకారం పరిహారం చెల్లించాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసి 45 రోజులవుతున్నా నేటికీ నిర్మాణ పనులు ప్రారంభించకపోవడం విచారకరమని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం అన్నారు.

యూనివర్సిటీ నిర్మాణ పనులకు రైతులు అంగీకారం తెలుపుతూ జిల్లా కలెక్టర్, యూనివర్సిటీ పీడీకి అఫిడవిట్ ఇచ్చినప్పటికీ పనులు ప్రారంభించకపోవడం సరికాద న్నారు. పునర్విభజన చట్టంలో పేర్కొన్నట్లు జాతీయ విద్యా సంస్థలు ఈ ప్రాంతానికి రావాలని రైతులు తమ పంట భూములు ఇచ్చిన విషయాన్ని లోకనాథం మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో గుర్తు చేశారు. హైకోర్టు ఆదేశాలను గౌరవించి ప్రభుత్వ యంత్రాంగం చొరవ తీసుకొని నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు. పెట్రో యూనివర్సిటీ సమస్యపై జిల్లా కలెక్టర్, రెవెన్యూ యంత్రాంగం దఫదఫాలుగా లబ్ధిదారులైన 12 కుటుంబాలతో చర్చలు చేసినప్పుడు, పెట్రో యూనివర్సిటీ నిర్మాణానికి అభ్యంతరం లేదని వారు తెలిపారన్నారు.

అయినప్పటికీ బాధితుల ఆమోదాన్ని పరిగణనలోకి తీసుకోకుండా నిర్మాణ పనులను ఎందుకు ఆలస్యం చేస్తున్నారో అర్థంకావడం లేదన్నారు. సానుకూలంగా స్పందించాల్సిన స్థానిక ఎమ్మెల్యే బాధ్యతారహితంగా ఉన్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం స్పందించి ఎటువంటి తాత్సారమూ లేకుండా పెట్రో యూనిర్సిటీ నిర్మాణ పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

ఉత్పత్తికి సిద్ధమవుతున్న పరిశ్రమలు

- ఫార్మా, సెజ్‌ల్లో రూ.1887 కోట్ల పెట్టుబడులు
- పారిశ్రామిక ప్రాంతానికి మరిన్ని పరిశ్రమలు రాక

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

రాష్ట్రంలో పారిశ్రామిక విస్తరణకు అవకాశమున్న అనకాపల్లి జిల్లాలో కొత్త పరిశ్రమల్లో ఉత్పత్తులు ప్రారంభంకానున్నాయి. జిల్లాలోని అచ్యుతాపురం సెజ్, పరవాడ జవహర్ నెహ్రూ ఫార్మా సిటీలో రూ.1887 కోట్ల పెట్టుబడులతో తొమ్మిది కంపెనీలు తమ ఉత్పత్తులను మూడు నుంచి ఆరు నెలల మధ్య ప్రారంభించనున్నాయి. ఉత్పత్తులు ప్రారంభిస్తే సుమారు 3,043 మందికి ఉపాధి లభించనుంది. ఉత్పత్తికి సిద్ధమవుతున్న ఈ కంపెనీల్లో కొన్ని ట్రయల్ రన్ కూడా ప్రారంభించాయి. తొమ్మిది కంపెనీల్లో ఎక్కువ భాగం ఫార్మావి మిగతా 2లో..

ఆరు నెలల్లో ఉత్పత్తులు ప్రారంభించనున్న కంపెనీలు

కంపెనీ	పెట్టుబడులు (కోట్లలో)	ఉపాధి
యూగియా స్టెరిల్స్	300	400
విన్‌విన్	108	382
లారస్	221	130
బయోకాన్	600	800
సిప్రా ల్యాబ్	45	200
వెస్‌వైస్	150	200
రిప్రాటెక్నిక్	178	367
డల్వ్‌కోట్	83.7	184
పిడిలైట్	202	380

పరిశ్రమలకు అనుకూల ప్రాంతమిది

పరిశ్రమలకు అనుకూల ప్రాంతమిది. పరవాడ ఫార్మా, అచ్యుతాపురం ఎస్ఇజెడ్‌లో పరిశ్రమలు ఇంకొన్ని రానున్నాయి. పరిశ్రమలకు ఇవ్వాల్సిన అనుమతులు, పరిశ్రమల ఉత్పత్తి స్వభావాన్ని మంజూరు చేయాల్సిన ఎన్ఒసిలు సకాలంలో వచ్చేలా ఇతర శాఖాధిపతులతో సమన్వయం చేసి పారిశ్రామికాధిపతులను ప్రోత్సహిస్తున్నాం. పారిశ్రామికాధిపతుల సమస్యలను తెలుసుకొని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నాం.

జిఎం శ్రీధర్,
జిల్లా పరిశ్రమల కేంద్రం అధికారి

మొదటి పేజీ తరువాయి..

అభివాదం చేస్తున్న నాయకులు

'ఉక్కు'ను కాపాడుకుంటాం

చిత్తశుద్ధితో ముందుకు రావాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మిక, ప్రజా సంఘాలు, అఖిలపక్ష పార్టీల నాయకులను ఇటీవల అరెస్టులు చేసి నిర్బంధించడం ద్వారా మోడీకి నిరసన సెగ తగలకుండా చేసిందని, ఇది తాత్కాలికమేనని అన్నారు. భవిష్యత్తులో విశాఖ ఉక్కు పోరాట వేడిని అడ్డుకునే వారందరూ మాడిపోక తప్పదని హెచ్చరించారు. సభకు జెఎసి నాయకులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, భోగవిల్లి నాగభూషణం, పడాల రమణ అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, ఎన్.రామారావు, వై.మస్తానప్ప, దొమ్మేటి అప్పారావు, ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు, సిఎఫ్‌టియుఐ జిల్లా కార్యదర్శి పి.వెంకటలక్ష్మి, పిఒడబ్ల్యు రాష్ట్ర కార్యదర్శి ఎం.లక్ష్మి, ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.పద్మ, వై.సత్యవతి, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు యుఎస్ఎన్.రాజు, పెన్షనర్ల సంఘం జిల్లా కార్యదర్శి కె.సుధాకర్, పిఎన్ఎం జిల్లా నాయకులు ఎం.చంటి, కె.నిర్మల, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కె.పెంటారావు, పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ కెఎం.కుమారమంగళం, ట్రాన్స్‌పోర్టు యూనియన్ కార్యదర్శి జి.అప్పలరాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్‌జె.నాయుడు, ఐద్వా నాయకులు బొట్టా ఈశ్వరమ్మ, తదితరులు ప్రసంగించారు. ప్రజానాట్యమండలి, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య కళాకారుల పాటలు చైతన్యం రేకెత్తించాయి.

ఉత్పత్తికి సిద్ధమవుతున్న పరిశ్రమలు

ఉన్నాయి. అచ్యుతాపురం సెజ్‌లో మూతపడ్డ డబ్ల్యుఎస్ కంపెనీని విన్‌విన్ యాజమాన్యం తీసుకుంది. రూ.108 కోట్ల పెట్టుబడులతో 382 మందికి ఉపాధి కల్పించే విన్‌విన్ కంపెనీ కొద్ది రోజుల్లో తమ ఉత్పత్తులు ప్రారంభించనుంది. రాంబిల్లిలో రూ.221 కోట్లతో లారస్ నాలుగో యూనిట్ మరో రెండు నెలల్లో ప్రారంభంకానుంది. పరవాడలో బయోకాన్, సిప్రా ల్యాబ్, వెస్‌వైస్, రిప్రాటెక్నిక్, అచ్యుతాపురంలో డల్వ్‌కోట్, పిడిలైట్ కంపెనీలు ఆరు నెలలలోపు ఉత్పత్తులు ప్రారంభానికి సిద్ధమవుతున్నాయి.

మాట్లాడుతున్న గౌరీ శంకరరావు

ఎస్‌జిఎఫ్ ఆధ్వర్యాన క్రీడా ఎంపికలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఎయు మైదానంలో ఉమ్మడి విశాఖ జిల్లా అథ్లెటిక్ సెలక్షన్ ట్రైల్ కార్యక్రమం జరిగింది. అండర్ 14, 17 విభాగాల్లో బాలుర, బాలికల అథ్లెటిక్ ఎంపికలు చేపట్టారు. సుమారు 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. విశాఖ జిల్లా ఉప విద్యాశాఖ అధికారి ఎ.గౌరీ శంకరరావు క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. క్రీడలలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అన్నారు. కార్యక్రమంలో సిహెచ్.వెంకట రెడ్డి, ఎ.శేఖర్, పి.సూరిబాబు, కె.సతీష్ పాల్గొన్నారు.

మొక్కలు పెంచాలని వినతి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎయులో మొక్కలు పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ వర్సిటీ రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్‌కు ఎఐఎస్ఎఫ్ విశాఖ జిల్లా అధ్యక్షులు యు.నాగరాజు మంగళవారం వినతిపత్రం అందజేశారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ నెల 12న విశాఖ పర్యటనకు వచ్చిన నేపథ్యంలో ఎయులో బహిరంగ సభ నిర్వహించేందుకు వర్సిటీలోని చెట్లును పెద్ద మొత్తంలో తొలగించారని గుర్తు చేశారు.

ఇది పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగించే చర్యని అన్నారు. ఈ నేపథ్యంలో మొక్కలు పెంచాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు నాయుడు, అభి, రాజశేఖర్ పాల్గొన్నారు.

నేడు 'వ్యవసాయ రంగం - సహకార సంఘాల పాత్ర'పై సెమినార్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : 'వ్యవసాయ రంగం-సహకార సంఘాల పాత్ర' అన్న అంశంపై బుధవారం ఉదయం 10 గంటలకు డాబా గార్డెన్స్‌లోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో సెమినార్ నిర్వహించనున్నారు. ప్రధాన వక్తలుగా ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు, ఎపి రైతు సంఘం పూర్వ కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజ శర్మ, విశాఖ ఉద్యోగ సహకార సంఘాల సమన్వయ కమిటీ కన్వీనర్ రెడ్డి వెంకటరావు పాల్గొననున్నారు

ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ వ్యవహరిస్తారని నిర్వాహకులు తెలిపారు.

జర్నలిస్టుల క్రీడలు అభినందనీయం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వైజాగ్ జర్నలిస్టుల ఫోరం, సిఎంఆర్ ఇంటర్ మీడియా స్పోర్ట్స్ మీట్‌ను జనవరి 3 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించేందుకు ప్రెస్ క్లబ్ కార్యవర్గం ఏర్పాట్లు చేస్తోంది. విశాఖ స్పోర్ట్స్ జర్నలిస్టుల అసోసియేషన్ సహకారంతో సిఎంఆర్ గ్రూపు సంస్థల సౌజన్యంతో ప్రతి ఏటా నిర్వహించే ఈ స్పోర్ట్స్ మీట్‌కు సంబంధించిన ట్రోఫీలను సిఎంఆర్ సంస్థ అధినేత మావూరి వెంకటరమణ మంగళవారం ఆవిష్కరించారు. జడ్జి కోర్టు ఎదురుగా ఉన్న సిఎంఆర్ షాపింగ్ మాల్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ గడచిన 22 ఏళ్లుగా ఇంటర్ మీడియా స్పోర్ట్స్ మీట్‌ను క్రమం తప్పకుండా వైజాగ్ జర్నలిస్ట్‌ల ఫోరమ్‌తో కలిసి ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. సమాజం కోసం నిరంతరం సేవలందించే జర్నలిస్టులకు ఆరోగ్యం కూడా అంతే ముఖ్యమన్నారు. పని ఒత్తిడితో ఉండే జర్నలిస్టులకు ఇటువంటి క్రీడల వల్ల ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. భవిష్యత్తులో కూడా జర్నలిస్టుల సంక్షేమానికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. వైజాగ్ జర్నలిస్టుల ఫోరం అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ సభ్యుల సంక్షేమమే లక్ష్యంగా తమ పాలకవర్గం పనిచేస్తోందన్నారు. ఇటీవలే దీపావళి పర్వదినానికి సంబంధించి సుమారు రూ.8 లక్షలతో బాణసంచా సామగ్రి పంపిణీ కార్యక్రమం చేపట్టామన్నారు. ఆ తరువాత ప్రతిష్టాత్మకమైన అవార్డుల ప్రదానోత్సవం, జర్నలిస్టుల పిల్లలకు ఉపకార వేతనాలు పంపిణీ పూర్తి చేశామన్నారు. 2023 జనవరి 3 నుంచి 12వ తేదీ వరకు ఇంటర్ మీడియా స్పోర్ట్స్ మీట్‌ను ఘనంగా నిర్వహిస్తామన్నారు. పోర్టు ఇండోర్ స్టేడియంలో మూడు రోజుల పాటు అథ్లెటిక్స్, చెస్, క్యారమ్స్ వంటి పోటీలు, పోర్టు క్రికెట్ మైదానంలో జనవరి 5 నుంచి 12 వరకు క్రికెట్ పోటీలు జరుగుతాయన్నారు. అందుకు సంబంధించి విజెఎఫ్ ప్రెస్‌క్లబ్ డాబాగార్డెన్స్ కార్యాలయం పనివేళల్లో మీట్ వివరాలు తెలుసుకోవచ్చునన్నారు. విజెఎఫ్ కార్యదర్శి దాడి రవికుమార్, ఉపాధ్యక్షులు, అవార్డుల కమిటీ చైర్మన్ ఆర్.నాగరాజ్ పట్నాయక్ మాట్లాడుతూ అవుట్ డోర్, ఇండోర్ పోటీలు సందర్భంగా ఉత్సాహవంతులైన జర్నలిస్టులు అందులో పాల్గొనవచ్చునన్నారు.

ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా, డెస్క్ జర్నలిస్టులు, ఫొటో, వీడియో జర్నలిస్టులు, వెబ్, మహిళా జర్నలిస్టులకు ఆయా పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తామన్నారు. జర్నలిస్టులకు సంబంధించిన అక్రిడేషన్ కార్డు విధిగా ఉండాలన్నారు. లేని పక్షంలో సంస్థ గుర్తింపు కార్డు కలిగి ఉండాలన్నారు. జర్నలిస్టుల క్రీడలను విజయవంతం చేసేందుకు అందరూ సహకరించాలని కోరారు.

ట్రోఫీని ఆవిష్కరిస్తున్న మావూరి వెంకటరమణ

బుసాన్‌కు చేరుకున్న భారత నౌకలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : భారతీయ నౌకాదళ నౌకలు శివాలిక్, కమోర్టా విన్యాసాల నిమిత్తం రిపబ్లిక్ ఆఫ్ కొరియాలోని బుసాన్‌కు చేరుకున్నాయి. ఆ దేశ నౌకాదళంతో వృత్తిపరమైన సామాజిక పరస్పర చర్యల నిమిత్తం శివాలిక్, కమోర్టా వెళ్లాయి. ఇరు దేశాల మధ్య రక్షణ బంధాన్ని ఈ విన్యాసాలు మరింత పటిష్టం చేయనున్నాయని నౌకాదళ అధి కారులు తెలిపారు.

విన్యాసాలకు బయలుదేరిన భారత నౌక

నేడు బీచ్‌లో అఖండ దీప హారతి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఆర్‌కె.బీచ్ కాళీమాత ఆలయం ఎదురుగా బుధవారం అఖండ దీప సాగర హారతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు విశ్వభారత్ మీడియా ఎడిటర్ చిన్ని కృష్ణ తెలిపారు. మంగళవారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విశ్వభారత్ మీడియా ఛైర్మన్ బలివాడ రమేష్, ఎమ్‌డి భీమరశెట్టి కిశోర్‌ల ఆధ్వర్యంలో ఆ రోజు సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు.

IN THE HONOURABLE COURT OF THE 3rd ADDITIONAL DISTRICT JUDGE FOR FAMILY COURT AT VIZIANAGARAM
FCOP.2/2020

Between:
Maganti Venugopala Rao ...Petitioner
And:
Maganti Moulika @Laxmi ......Respondent

Respondent:
Maganti Moulika @ Laxmi w/o Maganti Venugopala Rao D/o late Gummadi Rama Rao, Hindu, aged about 35 years, resident of Door No. 57- 23-2/B, Subashnagar, Vurvasi junction, Kancharapalem, Visakhapatnam town and District.

Please take notice that the above named petitioner filed the above FCOP.2/2020 against you for seeking divorce and the matter coming for your appearance and stands posted to **07-12-2022**, on that day your personally or through your Advocate attend before the Honorable Court at **10-30 A.M.,** failing which the Honorable Court will be heard and determined in your absence exparte as per Law.

V.SAMBA MURTHY
Advocate,
Vizianagaram

Place: Visakhapatnam
Dt. 22.11.2022

విద్యారంగ పరిరక్షణకు పోరాటం

నినాదాలు చేస్తున్న పిడిఎస్‌యు నాయకులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విద్య ప్రయివేటీకరణ, కాషాయీకరణకు వ్యతిరేకంగా విద్యార్థులు పోరాడాలని పిడిఎస్‌యు విశాఖ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఇ.సాయి, టి.అభిశ్రీ పిలుపునిచ్చారు. మంగళవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 25, 26, 27 తేదీలలో ఏలూరులో జరగనున్న పిడిఎస్‌యు రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేట్ విద్యాసంస్థలన్నింటినీ జాతీయం చేయాలన్నారు. కేజీ నుంచి పీజీ వరకు విద్య ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలన్నారు. విద్య ప్రైవేటీకరణతో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ, మహిళా విద్యార్థుల హక్కులను కాలరాసినట్లు అవుతుందన్నారు. నేడు విద్య లాభసాటి వ్యాపారంగా మారిందని తెలిపారు. దేశ, విదేశీ కార్పొరేట్ సంస్థలను విద్యారంగంలోకి ఆహ్వానించడం మంచిది కాదన్నారు. ఈ చర్యలను విద్యార్థులు ఐక్యంగా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. లేకుంటే విద్యారంగం తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

గ్రీన్ బెల్ట్ ఆక్రమణకు గురికాకుండా చర్యలు

ప్రజాశక్తి - ఆరిలోవ : బిఆర్‌టిఎస్ రోడ్డుకు ఆనుకొని ఉన్న గ్రీన్ బెల్ట్‌ను ఆక్రమణలకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని టౌన్‌ప్లానింగ్ ఎసిపి శాస్త్రిని జివిఎంసి కమిషనర్ పి.రాజాబాబు ఆదేశించారు. 12వ వార్డు పరిధి బిఆర్‌టిఎస్ రోడ్డు ఆరిలోవ, చినగదిలి, సంతపాలెం తదితర ప్రాంతాల్లో వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణితో కలిసి మంగళవారం ఆయన పర్యటించారు. గ్రీన్ బెల్ట్‌ను ఆక్రమించి ఏర్పాటుచేసిన చెత్త కొనుగోలు చేసే దుకాణాలను టౌన్‌ప్లానింగ్ సిబ్బంది తొలగించారు. ముడసర్లోవ జివిఎంసి నర్సరీలో ఒక పక్క అర్బన్ ప్రైమరీ హెల్త్‌సెంటర్‌ను, మరోపక్క మహిళా పార్కు ఏర్పాటు చేయాలని వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి కమిషనర్‌ను కోరారు. కంపోస్టు యార్డు ఎదురుగా ఉన్న ఆటస్థలం చుట్టూ ప్రహరీ, వాకింగ్ ట్రాక్ నిర్మించాలని, శ్రీకాంత్‌నగర్‌లో ఉన్న ఖాళీ స్థలాలను పార్కులుగా అభివృద్ధి చేయాలని కమిషనర్‌ను కోరారు. కమిషనర్ స్పందిస్తూ అంచెలంచెలుగా ఆయా పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన వైద్యాధికారి డాక్టర్ శాస్త్రి, ఎఎంఒహెచ్ డాక్టర్ ఎ.కిశోర్, కార్యనిర్వాహక ఇంజినీరు మత్స్యరాజు, డీడీ ఎం.దామోదరరావు, సహాయక కమిషనర్ పి.రమేష్ తదితర అధికారులు పాల్గొన్నారు.

జివిఎంసి కమిషనర్ రాజాబాబు

బిఆర్‌టిఎస్ రోడ్డులో పర్యటిస్తున్న జివిఎంసి కమిషనర్ రాజాబాబు

భీమిలి బీచ్ వద్ద ఏర్పాటుచేసిన పోలీసు హెచ్చరిక బోర్డు

తీరం వద్ద పోలీసు హెచ్చరిక బోర్డు ఏర్పాటు

ప్రజాశక్తి -భీమునిపట్నం : భీమిలి సముద్రపు ఒడ్డున స్థానిక పోలీసులు హెచ్చరిక బోర్డును మంగళవారం ఏర్పాటుచేశారు. సముద్రంలో స్నానానికి దిగి ఇటీవల ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థులు గల్లంతవ్వగా, ఒకరి మృతదేహం లభ్యమైన విషయం విదితమే. ఈ తరహా ప్రమాదాలు చోటు చేసుకోకుండా "ఇచ్చట సముద్ర స్నానం చేయుట ప్రమాదకరం, సందర్శకులు సముద్రంలో దిగరాదు' అంటూ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. సిఐ కె.లక్ష్మణమూర్తి, ఎస్సై జి హరీష్, జోనల్ కమిషనర్ ఎస్.వెంకటరమణ ఆధ్వర్యంలో హెచ్చరిక బోర్డును ఏర్పాటుచేశారు

సమస్యలపై సచివాలయ అధికారులకు వినతి

ప్రజాశక్తి -భీమునిపట్నం : గ్రామ, వార్డు పరిధిలోని సచివాలయ విద్యా కార్యదర్శుల సమస్యలపై, సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సచివాలయాల శాఖ అడిషనల్ కమిషనర్ కైలాశ్ గిరీశ్వర్‌కు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎమ్‌డి జానిపాషా ఆధ్వర్యాన వినతిపత్రం అందజేసినట్లు ఫెడరేషన్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ పివి కిరణ్‌కుమార్‌యాదవ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సచివాలయ క్షేత్ర స్థాయి సిబ్బందికి బయోమెట్రిక్ హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని, రెండో విడతలో జాయిన్ అయిన ఎంప్లాయీస్ పోలీస్ వెరిఫికేషన్, ప్రొబెషన్ తదితర సమస్యలపై వినతిపత్రం అందజేశామని తెలిపారు. ఇందుకు సంబంధిత అధికారులు సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఫెడరేషన్ నాయకులు నవీన్ కుమార్, మహబూబ్, రాజ్ కిరణ్ ఉన్నట్లు తెలిపారు.

ఎయు వీసీకి ఆహ్వానం

విశాఖపట్నం : ఆంధ్రాయూనివర్సిటీని కనకమహాలక్ష్మి దేవస్థానం చైర్ పర్సన్ కొల్లి సింహాచలం మంగళవారం సందర్శించారు. మార్గశిర మాసోత్సవాలకు రావాలని వీసీకిఆహ్వానపత్రం అందించారు.

నేడు అనంత పద్మనాభస్వామి దీపోత్సవం

ప్రజాశక్తి-పద్మనాభం : అనంతపద్మస్వామి కొండ దీపోత్సవ కార్యక్రమాన్ని ఈ ఏడాది బుధవారం నిర్వహించడానికి భక్తుల సహకారంతో దేవాదాయ, ధర్మాదాయశాఖ ఏర్పాట్లు చేసింది. ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా, ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు భారీ బందోబస్తును పోలీసులు ఏర్పాటుచేశారు. ముగ్గురు ఎసిసిలు, ఆరుగురు సిఐలు, 800 మంది పోలీసులను నియమించారు. వాహనాల రాకపోకలు, పార్కింగ్‌కు స్థలాలు కేటాయించారు. విజయనగరం నుంచి వచ్చే వాహనాలకు అనంతపద్మనాభం స్వామి వారి మామిడి తోట, జూనియర్ కళాశాల, పద్మనాభం జంక్షన్‌కు సమీపంలో ఉన్న గాడు అప్పలనాయుడు ఖాళీ స్థలాలను కేటాయించారు. తగరపువలస నుంచిన వాహనాలకు స్ప్రింగ్ ఫీల్డు ప్రయవేటు పాఠశాల వద్ద ఉన్న ఖాళీ స్థలాలను కేటాయించారు. సింహాచలం నుంచి వచ్చిన వాహనాలకు అనంతవరం- బోని జంక్షన్ల మధ్యలో ఉన్న ఇటుక బట్టీలు వద్ద స్థలాలను కేటాయించారు. విజయనగరం. సింహాచలం ఆర్‌టిసి డిపోల నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటుచేశారు.

కొండపైన ఉన్న అనంతపద్మనాభస్వామి, దిగువన ఉన్న కుంతీమాధస్వామి ఆలయాలను ముస్తాబు చేశారు. మహిళలకు మరుగుదొడ్లు ఏర్పాటుచేశారు. కొండపైన మెట్లు మార్గం వద్ద వైద్యశిబిరాలకు ఏర్పాట్లు చేశారు.

దీపోత్సవానికి సహకరించని సింహాచలం దేవస్థానం

ఈ దీపోత్సవాన్ని అత్యంత వైభవంగా సింహాచలం దేవస్థానం నిర్వహించాల్సి ఉంది. కానీ ఈ ఏడాది ఎటువంటి సహకారమూ అందించలేదు. స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కూడా దీపోత్సవ ఏర్పాట్లపై దృష్టిసారించలేదని స్థానికులు చెబుతున్నారు.

అభివృద్ధి పనులకు ముత్తంశెట్టి శంకుస్థాపన

ఎమ్మెల్యే కు వినతిపత్రం అందిస్తున్న కాలనీ వాసులు

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి 7వ వార్డు పరిధిలో పలు అభివృద్ధి పనులకు భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మంగళవారం శంకుస్థాపన చేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇచ్చిన హామీ మేరకు ఆర్టీసీ కాలనీలో రూ.76.41 లక్షలతో డ్రెయినేజీ వ్యవస్థ, సిసి రోడ్లు, రూ.38.70 లక్షలతో పిలకవానిపాలెం - పోతినమల్లయ్యపాలెం సిసి రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణాల కోసం శంకుస్థాపనలు చేశారు. అనంతరం ఆయన వార్డు ప్రజలతో మాట్లాడుతూ, వార్డులోని సమస్యలపై ఆరాతీశారు. సంక్షేమ పథకాలు అందుతున్న తీరునడిగి తెలుసుకున్నారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని స్థానికులు ఎమ్మెల్యేకు అందించారు. ఈ కార్యక్రమంలో వార్డు వైసిపి అధ్యక్షులు పోతిన శ్రీను, పోతిన హనుమంతురావు, కృష్ణమూర్తి పాత్రుడు, లింగేశ్వరవు, కుడితి రామారావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై జోనల్ కమిషనర్‌కు వినతి

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి మూడో వార్డు పరిధిలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జోనల్ కమిషనర్ ఎస్ వెంకటరమణకు వార్డు కార్పొరేటర్ గంటా అప్పలకొండ మంగళవారం వినతిపత్రం అందజేశారు. స్థానిక బీచ్‌లో ప్రమాదాలు జరగ కుండా లైఫ్ గార్డులను నియమించాలని, ఎగువపేట బీచ్‌లో మత్స్య కారుల వలల మరమ్మతుల కోసం నిర్మించిన షెడ్డును పునరుద్ధరించాలని కోరారు. ఇక్కడున్న ఓపెన్ జిమ్‌లో పాడైన వ్యాయామ పరికరాల స్థానంలో కొత్తవి అమార్చాలని, పలు ప్రాంతాల్లో ఐ మాక్స్ లైట్లు ఏర్పాటు చేయాలని, సామాజిక భవనాలకు మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తిచేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, టిడిపి నాయకులు ఎం.సంజీవకుమార్, కనకల అప్పలనాయుడు, కొక్కిరి అప్పన్న, గండిబోయిన పోలిరాజు, వియ్యపు పోతురాజు తదితరులు ఉన్నారు.

జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ అప్పలకొండ

నేరాలు ఘోరాలు

డ్రగ్స్ కేసులో నిందితుడు అరెస్ట్ - 212 మత్తు ఇంజక్షన్లు, మొబైల్ ఫోన్ స్వాధీనం

ప్రజాశక్తి -భీమునిపట్నం : భీమిలి పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న చిన్న బజారు రెల్లి వీధి జివిఎంసి ప్రాథమిక పాఠశాల ఎదురుగా సోమ వారం అర్థరాత్రి ఓ వ్యక్తి డ్రగ్స్‌తో పోలీసులకు పట్టుబడ్డాడు. సిఐ కె.లక్ష్మణమూర్తి కథనం ప్రకారం... టాస్క్ ఫోర్స్, స్థానిక సిఐ కె.లక్ష్మణమూర్తి, సిబ్బందితో కలిసి స్థానిక చిన్న బజారు, రెల్లి వీధి వద్ద నిఘా వేశారు. అదే ప్రాంతానికి చెందిన కాళ్ళ హరి పద్మ రాఘవ రావు (45) 212 ఓల్కాన్ పెంటాజోసెఫ్ ఐపి మత్తు ఇంజెక్షన్లతో పట్టు బడ్డాడు. సులభంగా డబ్బు సంపాదనకు అలవాటు పడిన ఇతడు సుమారు 6 కేసుల్లో నిందితునిగా ఉన్నాడు. ఇటీవలే జైలు నుంచి విడుదలైనప్పటికీ ఇతని ప్రవర్తనలో మార్పు రాలేదు. ఒడిశాలోని రాయఘడ రైల్వే స్టేషన్ వద్ద తక్కువ ధరకు మత్తు ఇంజక్షన్లు కొని ఇక్కడ ఎక్కువ ఖరీదుకు అమ్ముతుంటాడు. ఇతను కూడా మత్తు ఇంజక్షన్లు వేసుకుంటాడు. నిందితుని నుంచి 212 మత్తు ఇంజక్షన్లు, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకొని అతన్ని అరెస్ట్ చేశారు. సిఐ కె.లక్ష్మణమూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కన్స్యూమర్ రైట్స్ పేరుతో బెదిరిస్తున్న ముగ్గురు అరెస్ట్

ప్రజాశక్తి -కంచరపాలెం: 'కన్స్యూమర్ రైట్స్' పేరిట చిరు వ్యాపారులను బెదిరిస్తున్న ముగ్గురిని కంచరపాలెం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మాధవధార, మురళీనగర్‌లో చిరు వ్యాపారం చేసుకుంటున్న దకాణ వ్యాపారులపై తనిఖీల పేరిట ఈ ముగ్గురూ బెదిరింపులకు దిగారు. వినియోగదారుల హక్కుల కమిషన్ అధికారులు, ప్రతినిధులుగా చెప్పారు. ఫైన్ తప్పదంటూ వ్యాపారులకు రశీదులిచ్చి అక్రమంగా సొమ్ము వసూలు చేస్తున్నారు. ఓ చిరువ్యాపారికిచ్చిన రశీదులో డొనేషన్ అని ఉండటంతో అనుమానమొచ్చి స్థానికుల సహాయంతో నిలదీయడంతో వీరి బండారం బయటపడింది. పొంతనలేని వివరాలు చెప్పడంతో అనుమానం కలిగి కంచరపాలెం పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు వచ్చి చైర్మన్‌గా చెప్పుకుంటున్న ప్రభుకిరణ్ (45)ను, మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వీరి కారుపై ఎంపీ స్టిక్కర్ కూడా అతికించేశారు.

120 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-రోలుగుంట : మండలంలోని రొంగలపాలెం గ్రామంలో కారులో అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ముగ్గురు ముద్దాయిలను పట్టుకున్నామని రోలుగుంట ఎస్ఐ నాగకార్తీక్ తెలిపారు. వీరి వద్ద 120 కేజీల గంజాయితో పాటు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని, మరొకరు పరారీలో ఉన్నారన్నారు. పట్టుబడ్డ ముగ్గురు నర్సీపట్నం మండలం వేములపూడికి చెందిన వారని, వీరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు..

నాటుసారా తయారీ కేంద్రంపై దాడి

ప్రజాశక్తి- నాతవరం : మండలంలో నాటుసారా తయారీ కేంద్రంపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, అనకాపల్లి జాయింట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు దాడులు నిర్వహించినట్లు గొలుగొండ ఎస్ఇబి, సిఐ రాజారావు తెలిపారు నాతవరంమండలం, గుమ్మడికొండ గ్రామశివారులో దాడులు నిర్వహించి, 400 టీటర్ల సారా పులుపును స్వాధీనం చేసుకుని, అక్కడే ధ్వంసం చేశామన్నారు. 20 లీటర్లు సారాతో మారాటి వాసు అనే వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. దాడిలో ఎస్ఐ గిరి పాల్గొన్నారు.

శ్మశాన వాటిక అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని మూలకుద్దు పంచాయతీ పాత మూలకుద్దు శ్మశాన వాటికలో దివీస్ ఆధ్వర్యాన రూ.16 లక్షలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఎంపిపి దంతులూరి వెంకట శివ సూర్య నారాయణ రాజు మంగళ వారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ కొల్లి పార్వతి, వైసిపి నాయకులు కొల్లి కోటిరెడ్డి, పొట్నూరు చంద్రశేఖర్, దివీస్ సామాజిక బాధ్యత అధికారి నాగరాజు, సిబ్బంది నరసింహారావు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న ఎంపిపి వాసురాజు

62వ వార్డులో పర్యటిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

ప్రజా సమస్యలపై దృష్టి : ఆడారి

ప్రజాశక్తి - ములగాడ : కులమతాలు, పార్టీలకతీతంగా ప్రజల సమస్యలను పరిష్కరిస్తామని పశ్చిమ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా జివిఎంసి 62వ వార్డు పరిధిలోని జాలారివీధిలో కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ఆధ్వర్యాన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. ప్రజల సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌టియుసి జిల్లా అధ్యక్షులు కలిదిండి బద్రీనాథ్, కార్పొరేటర్లు పీవీ సురేష్, నాగేశ్వరరావు, 61, 63 వార్డుల వైసిపి ఇన్‌ఛార్జులు దాడి సత్యనారాయణ, పిలక రామ్మోహన్‌రెడ్డి, పీలా మాధవి, అనంతకుమార్, బిశెట్టి గణేష్, సోమాధుల సురేష్, డాక్టర్ చింతా ప్రభాకర్ పాల్గొన్నారు.

మార్గశిర మాసోత్సవ ఆహ్వానపత్రిక అందజేత

ప్రజాశక్తి-సీతమ్మధార : కనకమహాలక్ష్మీ అమ్మవారి మార్గశిర మాసోత్సవాల ఆహ్వాన పత్రికను మంగళవారం బాలయ్యశాస్త్రి లే-అవుట్‌లో చొక్కాకుల వెంకటరావుకు దర్శకర్తలమండలి సభ్యులు అందజేశారు. ఈ నెల 24నుంచి డిసెంబర్ 23వ తేదీ వరకు జరుగు అమ్మవారి పూజా కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, సభ్యులు వంకాయల మారుతీప్రసాద్, సతీష్, వెంకటరత్నం, రవి తదితరులు పాల్గొన్నారు.

పట్టాలను పంపిణీ చేస్తున్న వైసిపి నాయకులు

వడ్లపూడిలో రెండో విడత పట్టాల పంపిణీ

ప్రజాశక్తి-గాజువాక: జివిఎంసి 87వ వార్డు పరిధి వడ్లపూడిలో రెండో విడత పట్టాలను సచివాలయంలో 120 మందికి వైసిపి నాయకులు మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కోమటి శ్రీనివాసరావు, దానప్పలు, బొడ్డ గోవిందు, దామోదర్ పాల్గొన్నారు.

విశాఖ విమానాశ్రయ సలహామండలి సభ్యునిగా గంట్ల శ్రీనుబాబు

ప్రజాశక్తి -కరాస: సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి, వైజాగ్ జర్నలిస్టుల ఫోరం అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబును విశాఖ విమానాశ్రయ సలహా మండలి సభ్యుడిగా నియమించారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను విమానాశ్రయం డైరెక్టర్ కె.శ్రీనివాసరావు మంగళవారం గంట్ల శ్రీనుబాబుకు అందజేశారు. రెండేళ్ల పాటు శ్రీనుబాబు ఈ పదవిలో కొనసాగనున్నారు. విశాఖ విమానాశ్రయ అభివృద్ధికి తగిన సలహాలు, సూచనలు ఇచ్చి తోడ్పాటు అందించాలని డైరెక్టర్ కోరారు. సభ్యుడిగా నియమితులైన శ్రీనుబాబు మాట్లాడుతూ, దేశములో శరవేగముగా అభివృద్ధి చెందుతున్న విశాఖకు విమానాశ్రయమే అత్యంత కీలకమన్నారు. ఇక్కడ నుంచి మరిన్ని ప్రాంతాలకు కొత్త సర్వీస్‌లు, కార్గో సర్వీస్‌లు నడప గలిగితే పర్యాటకుల సంఖ్య, వ్యాపార అభివృద్ధి పెరుగుతుందన్నారు. తద్వారా విమానాశ్రయ వృద్ధికి దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. విమానాశ్రయ అభివృద్ధికి తన పరిధి మేరకు కృషి చేస్తామన్నారు. తన నియామకానికి కృషి చేసిన కేంద్ర విమానయాన సంస్థ, విశాఖ ఎంపీ ఎంవివి సత్యనారాయణ తదితరులకు శ్రీనుబాబు కృతజ్ఞతలు తెలిపారు.

మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- గాజువాక : జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం గాజువాకలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు రాము మాట్లాడుతూ, ఈ నెల 26,27 తేదీల్లో డాబాగార్డెన్ వద్ద ఉన్న అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో మహాసభలు జరుగుతాయని తెలిపారు. 26వ తేదీన సరస్వతి పార్కు నుంచి అల్లూరి విజ్ఞాన కేంద్రం వరకు భారీ ర్యాలీ ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగరాజు, సూరిబాబు, సావిత్రి పాల్గొన్నారు.

ప్రశ్నించేతత్వం అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-సీతమ్మధార: ప్రతి ఒక్కరూ చిన్ననాటి నుంచే ప్రశ్నించేతత్వం అలవర్చుకోవాలని సిబిఐ మాజీ జెడి లక్ష్మీనారాయణ సూచించారు. పౌర గ్రంథాలయంలో సెంటర్ ఫర్ స్టడీస్ ఆధ్వర్యాన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మంచి ఆలోచన ద్వారా చదువును అభ్యసిస్తే ఉన్నత శిఖరాలకు ఎదగవచ్చన్నారు. గొప్ప వ్యక్తులు పుస్తకాల ద్వారానే ఎదిగారని తెలిపారు. మనిషి ఎంత లోతుగా ఆలోచిస్తే అంత పరిజ్ఞానం పొందుతాడని పేర్కొన్నారు. సమాజంలో ఒక మంచి ఆలోచన ద్వారా ముందుకు సాగాలన్నారు. తద్వారా ఎదుటివారికి సహాయం చేసే ఆలోచన మనలో కలుగుతుందని పేర్కొన్నారు. తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను గౌరవించి చదువును క్రమశిక్షణగా అభ్యసించాలని సూచించారు. విద్యార్థులు గ్రూప్ డిస్కషన్ ద్వారా మరింత పరిపూర్ణత చెందుతారని చెప్పారు. అనంతరం గ్రంథాలయం ఆవిష్కరణను వివరించారు. భారతదేశంలో గ్రంథాలయాలు ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయకుమార్, సెంట్రల్ పాలసీ ఫర్ స్టడీస్ అధ్యక్షులు ప్రసన్నకుమార్, గ్రంథాలయం కార్యదర్శి డివిఎస్ వర్మ, గ్రంథాలయం సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సిబిఐ మాజీ జెడి లక్ష్మీనారాయణను సన్మానిస్తున్న ప్రతినిధులు

ధాన్ ఫౌండేషన్ సహకారం

సమావేశంలో మాట్లాడుతున్న బ్యాంకు మేనేజర్ శివకృష్ణ

ప్రజాశక్తి -ములగాడ : పొదుపు సంఘం సభ్యులకు ధాన్ ఫౌండేషన్ సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని మల్కాపురం కళంజియ సమాఖ్య కో-ఆర్డినేటర్ సుభాషిని తెలిపారు. ధాన్ ఫౌండేషన్ మల్కాపురం కళంజియ సమాఖ్య ఆధ్వర్యాన వికలాంగ గ్రూపుల సర్వ సభ్య ప్రతినిధుల సమావేశం మంగళవారం కాకరలోవ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ శివకృష్ణ హాజరై మాట్లాడారు. వ్యాపారం చేసుకోవాలనుకునే వారికి తక్కువ వడ్డీతో రుణాలు ఇస్తామని, గ్రూపులకు కూడా సాధారణ పొదుపు సంఘాల వలె రుణాలు అందిస్తామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఇన్సూరెన్స్ స్కీములు ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు. రీజనల్ హెల్త్ కో-ఆర్డినేటర్ మురళీకృష్ణ మాట్లాడుతూ, ధాన్ ఫౌండేషన్‌గా అనేక ఆరోగ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆరోగ్య కార్యకర్త విజయ వికలాంగుల పొదుపు, అప్పుల వివరాలు, సంవత్సర ప్రణాళిక చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి రాజేష్, మల్కాపురం కళంజియ సమాఖ్య కో-ఆర్డినేటర్ సుభాషిణి, సమాఖ్య నాయకులు హురున్నిసా బేగం, పార్వతి పాల్గొన్నారు.

ఎంఇఒను కలిసిన జిప్సా అధ్యక్షులు భాస్కరరావు

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక ఎంఇఒ బి.పెదప్పనాయుడును గాజువాక ఇండస్ట్రియల్ ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ అధ్యక్షులు పాలవలస భాస్కరరావు మంగళవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. గాజువాక ప్రైవేట్ స్కూల్స్ ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

ముత్తంశెట్టి చొరవతో అభివృద్ధి

వైసిపి మామిడిలోవ పంచాయతీ అధ్యక్షులు మహేష్

ప్రజాశక్తి -ఆనందపురం: భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చొరవతో నియోజవర్గ ఇన్‌ఛార్జి ముత్తంశెట్టి మహేష్ సహకారంతో మామిడిలోవ గ్రామపంచాయతీని అభివృద్ధి పరిచినట్లు ఆ గ్రామ పంచాయతీ వైసిపి అధ్యక్షులు బలిరెడ్డి వెంకట సూర్య మహేశ్వరరావు (మహేష్) తెలిపారు. గ్రామపంచాయతీలో సుమారు రూ.2.53 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేసినట్లు చెప్పారు. గ్రామపంచాయతీలో సచివాలయం, రైతు భరోసా, హెల్త్ సెంటర్, అమూల్ మిల్క్ సెంటర్ భవనాలు నిర్మించినట్లు తెలిపారు. హైవే రోడ్డు నుంచి మామిడిలోవ గ్రామానికి తారు రోడ్డు, పెద్దదబ్బందలో శ్మశానానికి రోడ్డు, బోరు, షెడ్, దబ్బంద ఎస్సీ కాలనీలో కమ్యూనిటీ హాల్, పెద్దదబ్బంద వాటర్ ట్యాంక్, దిబ్బమీదపాలెం నుంచి శొంఠ్యాం పాఠశాల వరకు తారు రోడ్డు, పలు సర్వీస్ రోడ్లు ఏర్పాటుచేసినట్లు వివరించారు. నాడు నేడు కార్యక్రమం ద్వారా దబ్బంద గ్రామంలో యుపి పాఠశాలను రూ.37 లక్షలతో, మామిడిలోవ ప్రాథమిక పాఠశాలను రూ.12 లక్షలతో అభివృద్ధిపరిచినట్లు తెలిపారు. గ్రామ పంచాయతీ పరిధిలోని అమ్మవార్ల గుడి వద్ద వీధిలైట్లు, దిబ్బమీదపాలెం గ్రామ దేవత గుడి దగ్గర బోరు, సిమెంట్ రోడ్డు ఏర్పాటు, జల జీవన్ పథకం ద్వారా మామిడిలోవ, మన్నిపాలెం గ్రామాలలో ఇంటింటికి కుళాయిలను ముత్తంశెట్టి శ్రీనివాసరావు చొరవతో ఏర్పాటు చేశామన్నారు.

పంచాయతీ పరిధిలో 212 మందికి జగనన్న ఇళ్ల మంజూరు చేశామని చెప్పారు. గ్రామంలో 425 మందికి వృద్ధాప్య, వితంతు, వికలాంగులు, ఒంటరి మహిళకు పింఛన్లను అందజేసినట్లు తెలిపారు.

శంకుస్థాపన కార్యక్రమంలో ముత్తంశెట్టి శ్రీనివాసరావు, మహేష్

మామిడిలోవ సచివాలయం నుంచి దిబ్బమీదపాలెం గ్రామం, గనిరెడ్డిపాలెం, శేషపాలెం మీదుగా మిందివానిపాలెం వీతం కళాశాల హైవే రోడ్డుకు రహదారి ఏర్పాటుకు అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు. దబ్బంద- మధురవాడ రోడ్డు ఏర్పాటు జరిగితే విశాఖపట్నం- మామిడిలోవ గ్రామపంచాయతీకి రవాణా వ్యవస్థ ఏర్పడుతుందన్నారు. దబ్బంద సెల్ టవర్, దబ్బంద నుంచి సింహాచలం మీదుగా ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేశామని తెలిపారు. గ్రామంలోని 2006 నుంచి 2014 వరకు తన భార్య బలిరెడ్డి రమణమ్మ సర్పంచ్ గానూ, 2014 - 20 కాలంలోఎంపిటిసి గానూ పంచాయతీ అభివృద్ధికి పలు కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు.

'ఉత్తరం'లో గ్రీవెన్స్

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గంలో ప్రజల సమస్యల పరిష్కారానికి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె రాజు మంగళవారం గ్రీవెన్స్ నిర్వహించారు. నియోజకవర్గానికి చెందిన పలువురు కార్యాలయానికి వచ్చి సమస్యలతో కూడిన వినతిపత్రాలను కెకె.రాజుకు అందించారు. ఆ వినతులను పరిశీలించి అధికారులతో మాట్లాడి కొన్నింటిని వెంటనే పరిష్కరించారు. మరికొన్నింటిని సంబంధిత అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, పి.ఉషశ్రీ, వార్డు అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కెకె.రాజుకు శుభాకాంక్షలు

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా కెకె.రాజును తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రకటించడంపై జివిఎంసి 43వ వార్డు కార్పొరేటర్ పి.ఉషశ్రీ, నాయకులు కలిసి మంగళవారం శుభాకాంక్షలు తెలిపారు. వారందరూ నియోజకవర్గ వర్గ పార్టీ కార్యాలయంలో కెకె.రాజును మర్యాద పూర్వకంగా కలిశారు. 2024 ఎన్నికల్లో గెలుపునకు కృషిచేస్తామని వారంతా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దుప్పలపూడి శ్రీనివాసరావు, తిరుపతిరావు, మీసాల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అన్న సమారాధన

ప్రజాశక్తి-సీతమ్మధార : రామకృష్ణనగర్ శివాలయం వద్ద మంగళవారం అన్న సమారాధన నిర్వహించారు. సుమారు 4500 మంది పాల్గొన్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ బొడ్డేటి కిరణ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇఒ అల్లు జగన్నాధరావు, వైసిపి నాయకులు పోతు సత్యనారాయణ, ధర్మకర్తలు మార్తాండమూర్తి, రాము, రాజ్యలక్ష్మి, శ్రీదేవి, అమ్మాజీ పాల్గొన్నారు.

శ్రద్ధావాకర్ హత్య బాధాకరం

ప్రజాశక్తి-సీతమ్మధార : దేశ రాజధాని ఢిల్లీలో శ్రద్ధావాకర్ హత్య అత్యంత బాధాకరమని జన జాగృతి సమితి రాష్ట్ర కన్వీనర్ చేతన పేర్కొన్నారు. నిందితుణ్ని ఎన్‌కౌంటర్ చేయాలని డిమాండ్‌చేశారు. పౌర గ్రంథాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నిందితుడు అశిక్ భానును ఎన్‌కౌంటర్ చేసే పోలీస్ అధికారికి రూ.5 లక్షల బహుమతిని అందజేస్తామని ప్రకటించారు. పెళ్లి చేసుకోమని అడిగిన పాపానికి అత్యంత క్రూరంగా 35 ముక్కలుగా నరికివేసిన మానవ మృగాన్ని తక్షణమే ఎన్‌కౌంటర్ చేయాలన్నారు. ఈ సంఘటనపై మహిళా సంఘాలు, రాజకీయ పార్టీలు స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సునీల్ కుమార్ జయరాం, నాయకులు దామోదర్ గుప్తా, సిద్ధార్థ అప్పలరాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎండి షెబనామ్‌కు శుభాకాంక్షలు

ప్రజాశక్తి -కంచరపాలెం : జివిఎంసి 53వ వార్డు పరిధి మర్రిపాలెం గ్రామం పార్వతీనగర్ కాలనీకి చెందిన ఎండి షెబనామ్ అండర్ 19 క్రికెట్ ఇండియన్ టీమ్‌కు సెలెక్ట్ అయిన సందర్భంలో వార్డు కార్పొరేటర్ బర్కత్ అలీ ఆమెను వార్డు కార్యాలయంలో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బర్కత్ అలీ మాట్లాడుతూ తండ్రి షకీల్ చిన్నప్పటి నుంచి క్రికెట్ మీద ఆసక్తితో రంజీలో ఆడి ఆపై కుటుంబ బాధ్యతలతో ఆగిపోయారని తెలిపారు. కుమార్తె రూపంలో ఇండియా టీమ్‌కు ప్లేయర్‌ని అందించారని కొనియాడారు. ఎండి షెబనాం మాట్లాడుతూ తల్లిదండ్రులు, కోచ్‌లు ఇచ్చిన ప్రోత్సాహంతోనే ఈ స్థాయికి చేరుకున్నానని తెలిపారు. ఈ బాలిక శివ శివాని స్కూల్లో పదో తరగతి చదువుతోంది. ప్రస్తుతం అండర్ 19 క్రికెట్ ఇండియన్ టీమ్ తరుపున న్యూజిలాండ్ సిరీస్‌కు ఆడబోతున్నట్లు చెప్పారు.

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పర్యటనపై నిరసన

సిఐటియు నేత గనిశెట్టి గృహ నిర్బంధం

నిరసన తెలియజేస్తున్న సిఐటియు నేతలను అడ్డుకుంటున్న పోలీసు

ప్రజాశక్తి - పరవాడ

కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి మంగళవారం పరవాడ ఎన్‌టిపిసి పర్యటన సందర్భంగా విశాఖ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ సిఐటియు ఆధ్వర్యాన నిరసన కార్యక్రమం చేపట్టారు. పరవాడ సినిమా హాల్ జంక్షన్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మివేస్తూ, రాష్ట్రానికి ద్రోహం చేసిన బీజేపీ ప్రభుత్వ పెద్దలు ఏమి ముఖం పెట్టుకుని విశాఖలో పర్యటన చేస్తున్నారని సిఐటియు నాయకులు దుయ్యబట్టారు. స్టీల్ ప్లాంట్ అమ్మివేస్తూ, ప్రత్యేక హోదా ఇవ్వకుండా రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన బీజేపీకి రాష్ట్రంలో అడుగు పెట్టే నైతిక హక్కు లేదని స్పష్టం చేశారు. రాష్ట్ర వైసీపీ నేతలు కూడా బీజేపీ ప్రభుత్వం ముందు మోకరిల్లుతున్నారని విమర్శించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పర్యటన నేపథ్యంలో సిఐటియు నాయకుల అక్రమ అరెస్ట్, గృహ నిర్బంధం చేయడం దుర్మార్గమన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి వివి శ్రీనివాసరావు, ఐద్వా జిల్లా అధ్యక్షులు పి.మాణిక్యం, సిఐటియు నాయకులు కె.నాయుడు, గోరపోటీ శ్రీను, అప్పలబాబు, బండారు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సిఐటియు నాయకులు గనిశెట్టి గృహనిర్బంధం

మునగపాక రూరల్ : కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పరవాడ పర్యటన సందర్భంగా ఎన్‌టిపిసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి గనిశెట్టి సత్యనారాయణను మండలంలోని వెంకటాపురం గ్రామంలో మంగళవారం ఆయన స్వగృహంలో పోలీసులు అదుపులోకి తీసుకుని గృహ నిర్బంధం చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర మంత్రి పర్యటన సందర్భంగా తెల్లవారుజాము నుండి పోలీసులు తన ఇంటి వద్ద పహారా కాయడం, గృహనిర్బంధం చేయడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. బిజెపి ద్రోహంపై ప్రశ్నిస్తానని ముందుగా పోలీసులు తనను అదుపులోకి తీసుకున్నారని పేర్కొన్నారు. ఇటీవల ఎన్‌టిపిసి బర్నింగ్ ప్రమాదంలో గాయపడ్డ దళాయి రాంబాబుకు మెరుగైన వైద్యం అందించాలని, నష్టపరిహారం చెల్లించాలని గనిశెట్టి డిమాండ్ చేశారు.

గృహ నిర్బంధంలో ఉన్న గనిశెట్టి సత్యనారాయణ

సిపిఎం ఖండన

గనిశెట్టి సత్యనారాయణను పోలీసులు గృహ నిర్బంధం చేయడాన్ని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం ఓ ప్రకటనలో ఖండించారు. ఉద్యమకారులపై నిర్బంధకాండ తగదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటుపరం చేస్తూ, రాష్ట్రానికి తీవ్ర ద్రోహం చేసిన బిజెపికి చెందిన మంత్రులు ఏ ముఖం పెట్టుకుని ఏపిలో అడుగుపెడుతున్నారని మండిపడ్డారు.

పైడితల్లి అమ్మవారికి దండాలు పెడుతూ నిరసన తెలుపుతున్న నిర్వాసితులు

నేవీ నిర్వాసితుల వినూత్న నిరసన

ప్రజాశక్తి- రాంబిల్లి

నేవల్ బేస్ నిర్వాసితుల సమస్యలపై ఎనిమిది గ్రామాల ప్రజలు చేస్తున్న ఆందోళన మంగళవారం నాటికి 23వ రోజుకి చేరుకుంది. ఈ సందర్భంగా ధర్నా శిబిరం పక్కనే ఉన్న పైడమ్మ తల్లి ఆలయం వద్ద నిర్వాసితులు పెద్ద ఎత్తున దండాలు పెడుతూ వినూత్న నిరసన తెలిపారు. 23 రోజులుగా ఆందోళన చేస్తున్నా సమస్యలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, జిల్లా అధికారులు పట్టించుకోలేదని, మీరైనా మా సమస్యల పరిష్కారానికి దారి చూపాలని దండాలు పెడుతూ వేడుకున్నారు. ఈ ధర్నా శిబిరానికి టిడిపి ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు తరపున పార్టీ మండల అధ్యక్షులు దిన్‌బాబు రూ.50 వేలు విరాళం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎనిమిది గ్రామాల నిర్వాసితులు, పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా ధన్వంతరి జయంతి

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : ఆయుర్వేద పితామహుడు ధన్వంతరి జయంతిని స్థానిక సాయిబాబా గుడి ఆవరణలో మంగళవారం జిల్లా ఆయుర్వేద గ్రామీణ వైద్యులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యులు డాక్టర్ నూకరాజు, రాజు, తోటాడ ప్రసాద్, శ్రీను, తులసి తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో పతకాలు

ప్రజాశక్తి-కశింకోట : విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీ గ్రౌండ్స్‌లో నిర్వహించిన ఉమ్మడి విశాఖ జిల్లా అథ్లెటిక్స్ 100 మీటర్స్ హర్డిల్స్ విభాగంలో కశింకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు విద్యార్థి ఎలువాడ జాషువా డేనియల్ రజిత పతకం సాధించారు. ఇదే విద్యార్థి లాంగ్ జంప్‌లో కాంస్య పతకం సాధించారు. త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి 100 మీటర్స్ హర్డిల్స్ పోటీల్లో డానియల్ పాల్గొంటారు. ఈసందర్భంగా డానియల్‌ను పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు ఎ.శ్రీధర్ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు వెదుల ప్రభాకరరావు విద్య కమిటీ ఛైర్మన్ బుద్ద దీపా, ఉపాధ్యాయులు మంగళవారం అభినందనలు తెలిపారు.

ప్రతిభ కనబరిచిన డానియల్

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

పశుసంవర్ధక శాఖ ఎడి డాక్టర్ లావణ్య

ఖనిజ లవణ మిశ్రమం, మందులను అందజేస్తున్న డాక్టర్ లావణ్య

ప్రజాశక్తి- అనకాపల్లి

ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ ద్వారా అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ లావణ్య తెలిపారు. మండలంలోని మాకవరం గ్రామంలో మంగళవారం పశు సంవర్ధక శాఖ, రిలయన్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. మండల పశువైద్యాధికారి అనిల్ కుమార్ 80 పశువులకు ఉచిత గర్భ కోశ చికిత్సలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పశువులకు లంపి స్కిన్ వ్యాధి బారిన పడకుండా ఉచితంగా టీకాలు వేస్తున్నట్లు చెప్పారు. రాయితీపై సంపూర్ణ మిశ్రమ దాణా అందుబాటులో ఉందన్నారు. పశువుల అత్యవసర చికిత్సలకు వైయస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ వాహనం టోల్ ఫ్రీ నెంబర్ 1962 కు ఫోన్ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఉచితంగా ఖనిజ లవణ మిశ్రమాన్ని, మందులను డాక్టర్ లావణ్య చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సీతానగరం పశు వైద్యులు డాక్టర్ రామారావు, గ్రామ సర్పంచ్ నూకరాజు, ఉప సర్పంచ్ లోవ లక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు బి. అప్పలనాయుడు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

డాక్టర్ అలేఖ్యను సత్కరిస్తున్న కలెక్టర్, జెసి, డిఎంహెచ్ఒ

వైద్యాధికారికి సత్కారం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా అచ్యుతాపురం ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి బి.అలేఖ్య అందించిన సేవలను గుర్తించి మంగళవారం జిల్లా కలెక్టర్ రవి పఠాన్ శెట్టి చేతుల మీదుగా ఆమెను సాలువ, జ్ఞాపకంతో సత్కరించారు. చోడపల్లి గ్రామ సచివాలయం ఆవరణలో ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలను ఆమె అందించే పనితీరును ప్రత్యేక బృందం పరిశీలించి ఆమె సేవలను గుర్తించారు. ఈ కార్యక్రమంలో జెసి కల్పనాకుమారి, డిఎంహెచ్ఓ హేమంత్, ఫ్యామిలీ ఫిజిషన్ జిల్లా ఇన్‌ఛార్జి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

విశాఖలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఈనెల 23, 24, 25 తేదీల్లో రాష్ట్రస్థాయి రైతు శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు పిలుపునిచ్చారు. మండలంలోని తిమ్మరాజుపేట పెదపాడు తదితర గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా రైతులతో కలిసి శిక్షణ తరగతుల ప్రధాన ఉద్దేశాన్ని వివరించారు. 'రైతులను రక్షించుకుందాం -కాపాడుకుందాం' కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ఈ శిక్షణా తరగతులకు ముఖ్య అతిథులుగా పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు, ఏపీ రైతు సంఘం రాష్ట్ర పూర్వ కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ, విశాఖ ఉద్యోగ సహకార సంఘాల సమన్వయ కమిటీ కన్వీనర్ రెడ్డి వెంకట్రావు తదితరులు హాజరవుతారని తెలిపారు.

'డైట్' వార్షికోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- అనకాపల్లి : విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు తమ కళాశాల ఆధ్వర్యంలో వివిధ సాంస్కృతిక, క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు డైట్ కళాశాల ఛైర్మన్ దాడి రత్నాకర్ అన్నారు. డైట్ కళాశాలలో మంగళవారం వైబ్రెంట్ డైట్-2022 గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 12, 13 తేదీల్లో కళాశాల వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపక , అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపివి ప్రజావ్యతిరేక విధానాలు

మాట్లాడుతున్న టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు అనిత

ప్రజాశక్తి-అనకాపల్లి

వైసిపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరిస్తుందని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలు వంగలపూడి అనిత అన్నారు. స్థానిక రింగ్ రోడ్డులోని టిడిపి కార్యాలయంలో మంగళవారం టిడిపి మండల అధ్యక్షులు, క్లస్టర్ కన్వీనర్లు, యూనిట్ కన్వీనర్లకు వర్క్‌షాప్ నిర్వహించారు. రాబిన్ శర్మ కిరణ్ నాయకత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని మాజీ ఎంపీ పప్పల చలపతిరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ విధానాలతో ప్రజలు ఇదేం కర్మ.., ఇదేమి ప్రభుత్వం అని భావిస్తున్నారని తెలిపారు. వైసిపి సమావేశాలకు డ్వాక్రా మహిళలను, పింఛన్‌దారులను బలవంతంగా తరలిస్తున్నారని, వెళ్లకుంటే పథకాలు రద్దు చేస్తామని బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఇటువంటి ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు, ప్రధాన కార్యదర్శి లాలం కాశి నాయుడు, ధనాల విష్ణు చౌదరి, కొణతాల రత్న కుమారి, కార్పొరేటర్ మాదంశెట్టి చిన్న తల్లి నీలబాబు, మళ్ల సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్‌లో సైన్స్ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి - దేవరాపల్లి : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం పాఠశాల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. 6 నుండి 10వ తరగతి వరకు గల విద్యార్థులు వివిధ అంశాల ఆధారంగా ప్రాజెక్టులు తయారు చేసి ఈ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించారు. విద్యార్థులకు పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు ఎన్.సునీత, ఎం.అరుణకుమారి, వి.శ్రీనివాసరావు, ఎం.మురళీ పట్నాయక్, డి.పూర్ణానందం సహాయ సహకారాలు అందించారు. విద్యార్థులను, సైన్స్ ఉపాధ్యాయులను పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం ఎం.పాండురంగారావు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

సైన్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసిన విద్యార్థులు

రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి- అనకాపల్లి : రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి రంగాచారి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ధాన్యం కొనుగోలుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 17 నుంచి ధాన్యం కొనుగోలు ప్రారంభిస్తామన్నారు. గ్రేడ్ వన్ రకం క్వింటాలుకు రూ.2,060, సాధారణ రకం క్వింటాలుకు రూ.2,040గా ప్రభుత్వం ధర నిర్ణయించిందన్నారు. ధాన్యం అమ్మాలనుకునే రైతు నమూనాలను రైతు భరోసా కేంద్రాలకు తీసుకొచ్చి పరీక్షించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు పీవీఎల్ఎన్ గంగాధర్‌రావు, ఆత్మ రామకృష్ణ, ఏఈఓ గణేష్, గ్రామ రెవెన్యూ అధికారులు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేటలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి భాస్కరరావు

బుచ్చయ్యపేట : ధాన్యం కొనుగోలుపై రైతులకు గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారులు, వాలంటీర్లు అవగాహన కల్పించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి బి భాస్కరరావు అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండలంలోని రైతు భరోసా కేంద్రాల వాలంటీర్లతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి ధాన్యం కొనుగోలు, ప్రభుత్వ మద్దతు ధర, ధాన్యం నాణ్యత తదితర అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు.

మునగపాక రూరల్ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ధాన్యం కొనుగోలుపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు బాబ్జి, ఎంపీడీవో రవికుమార్, వ్యవసాయాధికారిని జ్యోష్నా కుమారి, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, అగ్రికల్చరల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

తాగునీటి పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్‌పర్సన్

తాగునీటి పథకం ప్రారంభం

ప్రజాశక్తి-యలమంచిలి రూరల్ : యలమంచిలి మున్సిపాలిటీ పరిధి, 20వ వార్డులో తాగునీటి పథకాన్ని స్థానిక ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు మంగళవారం ప్రారంభించారు. దీనికి ముందు గ్రామంలో గడప గడపకి మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ప్రజా సమస్యలు, సంక్షేమ పథకాల అమలు గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి, మున్సిపల్ కమిషనర్ తోట కృష్ణవేణి, ఎంపీపీ బోద్దేపు గోవింద, బొదపు ఎర్రయ్య దొర, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు చేరాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే ప్రతి పథకం అర్హులైన లబ్ధిదారులకు చేరేలా సచివాలయ సిబ్బంది కృషి చేయాలని ఎంపిపి గొర్లి సూరిబాబు అన్నారు. మండలంలోని వెంకుపాలెం గ్రామ సచివాలయాన్ని, అంగన్వాడీ కేంద్రాలను మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పథకాల్లో లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాపేటి నాగేశ్వరరావు, మండల కో ఆప్షన్ సభ్యులు బోండా అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ధర్నా పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : హైదరాబాద్ ఐఆర్‌డిఏ కార్యాలయం వద్ద డిసెంబర్ 9న జరగనున్న ధర్నాను విజయవంతం చేయాలని ఎల్‌ఐసి ఏజెంట్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ అధ్యక్షులు పెంటకోట సైదునాయుడు పిలుపునిచ్చారు. స్థానిక ఎల్ఐసి కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కస్టమర్లకు ఇచ్చే బోనస్ పెంచాలని, ప్రీమియంపై జిఎస్టి విధింపు రద్దు చేయాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ పెంచి ప్రీమియం తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రూరల్ బ్రాంచ్ అధ్యక్షులు శంకర్రావు, సీనియర్ ఏజెంట్లు నడిశెట్టి అప్పారావు, పీల శ్రీనివాస్, కుమార్, బి ఆర్ జి శ్రీనివాస్, సత్య రావు, యూనియన్ కోశాధికారి కరణం మాణిక్యం రావు, అలంక నాగేష్, అయిత రాము, హనుమంత్, ప్రకాష్ రావు పాల్గొన్నారు.

సదరం సర్టిఫికెట్ల పరిశీలన

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని రాజాం, బుచ్చయ్యపేట గ్రామ సచివాలయాల పరిధిలో వికలాంగులకు సంబంధించిన సదరం సర్టిఫికెట్లను అధికారులు మంగళవారం పరిశీలించారు. రాజాం సచివాలయం పరిధిలోలో రాజాం, నీలకంఠపురం గ్రామాల్లో 106 పెన్షనర్ల ఉండగా, మొదట రోజు 78మంది సర్టిఫికెట్ పరిశీలన జరిగింది. ఈ కార్యక్రమం ఎంపీడీఓ సువర్ణ రాజు, ఏవో కె శ్రీనివాసరావు, స్థానిక సర్పంచ్ మరిసా నాని, కార్యదర్శి వసంత్, వాలంటీర్లు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

రీ సర్వేతో రైతులకు భూ హక్కులు

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని అమృతపురం పంచాయితీ శివారు చింతగట్ల అగ్రహారం గ్రామంలో సమగ్ర భూ రీసర్వేను తహసీల్దార్ బి.సత్యనారాయణ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు భూహక్కులు పొందేందుకు భూ రీ సర్వే ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిటి వెంకట్, సర్వేయర్ కె.శ్రీనివాసరావు, ఆర్ఐ వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

సర్వేను పరిశీలిస్తున్న తహశీల్దారు సత్యనారాయణ

వామపక్ష, ప్రజాతంత్ర, లౌకిక శక్తుల ఏకం

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి సత్యనారాయణమూర్తి

ప్రజాశక్తి-అనకాపల్లి

మతతత్వ బిజెపిని గద్దె దించాలంటే వామపక్ష, ప్రజాతంత్ర లౌకిక శక్తులు ఏకం కావలసిన అవసరం ఉందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి సత్యనారాయణమూర్తి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య అన్నారు. స్థానిక న్యూ కాలనీ రోటరీ కళ్యాణ మండపంలో మంగళవారం సిపిఐ అనకాపల్లి జిల్లా విస్తృత సమావేశం జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు, నల్లధనం వెలికితీత వంటి హామీలు తుంగలో తొక్కిందన్నారు. మోడీ ప్రభుత్వ హయాంలో అసంఘటిత రంగం, వ్యవసాయ రంగం పూర్తిగా దెబ్బతిందని, రైతుల ఆత్మహత్యలు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మకానికి పెట్టిందన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర అభివృద్ధిని పక్కనపెట్టి తమ సొంత ప్రయోజనాలు చూసుకుంటున్నారని విమర్శించారు. విభజన చట్టాల అమలు, స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై కనీసం కేంద్రంపై ఒత్తిడి తేలేదన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శులు రాజాన దొరబాబు, రామునాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు గురుబాబు, సన్యాసిరావు, సుబ్బలక్ష్మి, అప్పలరాజు, శాఖ, మండల కార్యదర్శులు పాల్గొన్నారు.

గుడివాడ సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి- అనకాపల్లి

మాజీ మంత్రి కీర్తిశేషులు గుడివాడ గురునాథరావు చేసిన సేవలు చిరస్మరణీయమని ఎంపిపి గొర్లి సూరిబాబు అన్నారు. మండలంలోని తగరంపూడిలో గురునాథరావు 21వ వర్ధంతి కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అయిత ఆనంద రాము, సర్పంచ్ యాదగిరి అప్పారావు, వ్యవసాయ సలహా మండలి సభ్యులు మొల్లి అప్పారావు, వైసిపి నాయకులు శ్రీనివాసరావు, యాదగిరి రామచంద్రరావు, వెంకు పాలెం సర్పంచ్ రాపేటి నాగేశ్వరరావు, మండల కో ఆప్షన్ సభ్యులు అప్పలరాజు పాల్గొన్నారు. మండలంలోని తుమ్మపాల గ్రామంలో గురునాథరావు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి గ్రామ సర్పంచ్ తట్టా పెంటయ్య నాయుడు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు పంచదారల కన్నారావు, పన్నీరు వెంకటలక్ష్మి చంటి, వార్డు మెంబర్లు గోవిందమ్మ, మోదీ నాయుడు, కృష్ణ, ఆర్టీసీ సత్యనారాయణ, స్కూలు కమిటీ చైర్మన్ గొంతిన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కశింకోట : గురునాథరావు వర్ధంతి వేడుకలు మండలంలోని ఉగ్గిన పాలెంలో ఎంపిపి కలగా లక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కలగా గున్నయ్య నాయుడు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు. ఎఎస్ పేట గ్రామంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మలసాల కిషోర్, కన్నూరుపాలెంలో నరిశింగబిల్లి సహకార బ్యాంకు పర్సన్ ఇన్‌ఛార్జి గండి నాయుడు బాబు, తీడ సర్పంచ్ చిరికి సత్యనారాయణ, తాళ్ల పాలెం పంచాయతీ కార్యాలయం వద్ద మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యులు అద్దంకి సత్యనారాయణ, చిన్ని వల్లభ నారాయణరావు, ఇందల ముసలి నాయుడు, చిన్ని రాజీవ్, వార్డు సభ్యులు కొన తాతీలు ఆధ్వర్యాన గురునాథరావు వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు.

గ్రావెల్ అక్రమ తరలింపుపై ఫిర్యాదు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : అక్రమంగా గ్రావెల్ తరలింపుదారులపైనా, వారికి సహకరించిన రెవెన్యూ సిబ్బంది పైనా చర్యలు తీసుకోవాలని జనసేన నాయకులు ఎం.శ్రీవేణి మంగళవారం తహశీల్దారుకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్‌కు స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు. దానిపై తహశీల్దారు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు సరగడం నాగార్జున పాల్గొన్నారు.

మిడ్డే మీల్స్ అమలు తీరు పరిశీలన

ప్రజాశక్తి - దేవరాపల్లి : మండలంలోని ముషిడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం భోజనాన్ని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక మండల అధ్యక్షుడు కొరుప్రోలు శ్రీను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహ్నం భోజనం ఏ విధంగా వండి పెడుతున్నారు, నాణ్యత, రుచిపై అడిగి తెలుసుకున్నారు. బాగా వండి పెడుతున్నారని విద్యార్థులు చెప్పడంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.

రూ.22 లక్షలతో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని నరేంద్రపురం పాఠశాలలో నాడు -నేడు కింద రూ.22 లక్షలతో అభివృద్ధి పనులను ఎంపీటీసీ రావి నాగలక్ష్మి శోభన్ బాబు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే కన్నబాబురాజు సిఫారసు మేరకు మంజూరు ఈ నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు.

చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

లక్ష్మీపురంలో చోరీ

ప్రజాశక్తి- చోడవరం : మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో గుటాల సూర్యనారాయణ ఇంట్లో మంగళవారం పట్టపగలే చోరీ జరిగింది. ఇంటికి వేసి ఉన్న తాళాన్ని పగలగొట్టి ఇంట్లో ఉన్న ఐదు తులాల బంగారం, రూ.50వేలు నగదు దొంగలు దోచుకు వెళ్లినట్లు బాధితులు చెబుతున్నారు. సంఘటన స్థలానికి సిసిఎస్ టీం వచ్చి పరిశీలించారు. ఈ సంఘటనపై స్థానిక సిఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ బాధితులు సమగ్రమైన ఫిర్యాదు ఇంకా తమకు ఇవ్వలేదని తెలిపారు. పట్టపగలే దొంగతనం జరగడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

గంజాయి నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-కశింకోట : కసింకోట పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఏడాది గంజాయి తరలింపుపై నమోదు చేసిన కేసులో నిందితునిగా ఉన్నన లోక్ సింగ్ చౌహాన్ (22)ను మంగళవారం అరెస్టు చేశారు. అనకాపల్లి రూరల్ సిఐ ఎ.రవికుమార్, ఇతర పోలీస్ సిబ్బంది సహాయంతో అనకాపల్లి ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ వద్ద అరెస్టు చేశారు. నిందితుడు అల్లూరి జిల్లా జి.మాడుగులకు చెందిన వ్యక్తి. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

పోటీల్లో కేంబ్రిడ్జి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- కశింకోట : ఈనెల 20న గ్రంథాలయం వారోత్సవాలు సందర్భంగా నిర్వహించిన చిత్రలేఖనం క్విజ్ పోటీల్లో స్థానిక కేంబ్రిడ్జ్ స్పేస్ పాఠశాల విద్యార్థులు పలు బహుమతులు గెలుచుకున్నారు. వీరిని పాఠశాల కరస్పాండెంట్ విల్సన్ మంగళవారం అభినందించారు.

పశువుల దాణా పంపిణీ

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని నూతన గుండుపాలెం, ఎఎస్.పేట రైతు భరోసా కేంద్రాల్లో మంగళవారం 11 టన్నులు సమీకృత మిశ్రమ దాణాను పంపిణీ చేశారు. ఎన్‌జి పాలెంలో 5 టన్నులు, ఎఎస్ పేటలో 6 టన్నులు అందజేశారు. నరిశింగబిల్లి పశు వైద్య అధికారి సిహెచ్ చైతన్య మణి, సర్పంచ్ కలిగట్ల సూరరత్నం, వైసిపి నాయకులు కలిగట్ల నాయుడు, పశు వైద్య సహాయకులు రాజేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

బోరుబావి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - పరవాడ : మండలంలోని ముత్యాలమ్మపాలెం పంచాయతీ పరిధి, సమ్మంగిపాలెం, జాలారిపేట గ్రామాల ప్రజలు దాహార్తిని తీర్చేందుకు నాయడుపాలెం పంచాయతీ పరిధిలో బోరుబావి ఏర్పాటు పనులను సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు మంగళవారం చేపట్టారు. ముత్యాలమ్మపాలెం పంచాయతీ పరిధిలో భూగర్భ జలాలు లేనందున నాయుడు సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మి సీతారామయ్య సహకారంతో ఆ గ్రామంలో బోరుబావిని ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడ నుంచి సమ్మంగి పాలెం జాలారిపేట గ్రామాలకు పైపులైన్ ద్వారా తాగునీరు అందించనున్నారు.

రహదారుల గోతులను పూడ్చండి

ప్రజాశక్తి - పరవాడ : మండలంలో ప్రధాన రహదారుల్లో గోతులు పడి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, వాటిని తక్షణమే పూడ్చాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ఆర్.నాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన గోతులు పడిన రహదారులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.3 కోట్లతో రోడ్డు వేసినా హిందూజా బొగ్గు లారీలు వెళ్లడంతో రోడ్డు గోతులు పడి ప్రమాదాలకు నిలయంగా మారినట్లు చెప్పారు. తక్షణమే రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలని, లేకుంటే జనవరి 1న రోడ్డుపై నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరించారు.

కనకమహాలక్ష్మి మార్గశిర మాసోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - యలమంచిలి : గత ఏభైఏళ్లుగా యలమంచిలి ధర్మవరం వీధిలో ప్రతిష్టాత్మకంగా జరిగే కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయినట్లు మంగళవారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఉత్సవ నిర్వహణ కమిటీ తెలియజేసింది. స్థానికులే కాకుండా జిల్లా నలుమూలల నుండి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు వారు తెలిపారు. విలేకర్ల సమావేశంలో కొరారు సాంబశివరావు, మడగల సత్యనారాయణ, కొరారు కొండబాబు, పిళ్లా రాము, కొరారు గోవిందు, అల్లిమిల్లి రాజా, గొల్లవిల్లి చిన్నాజీ, పివిఎస్ నాగేశ్వరరావు, గుర్రం మురళి పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ప్రిన్సిపల్ సంధ్య

ప్రజాశక్తి- నర్సీపట్నం రూరల్ : నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకున్న స్థానికవిద్యార్థులకు యూత్ ఫర్ సేవ, శ్రీవేమ ఎన్జీవో వేములపూడి ఆధ్వర్యంలో మంగళవారం స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. వేములపూడి ఎపి మోడల్ స్కూల్, బాలికల హైస్కూల్‌లో ఈ పరీక్ష కోసం 100 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా వారందరికీ ఉచితంగా స్టడీమెటీరియల్‌ను స్థానికమోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సంధ్య ద్వారా అందించారు. కార్యక్రమంలో శ్రీరామ ఎన్జీవో సెక్రెటరీ బోలెం శివ, అడిగర్ల సతీష్ పాల్గొన్నారు.

రోగులకు పాలు, రొట్టెల పంపిణీ

రోగులకు పాలు రొట్టె అందిస్తున్న జనార్ధన్

ప్రజాశక్తి-నక్కపల్లి : సత్యసాయి భజన మండలి సభ్యుల ఆధ్వర్యంలో స్థానిక సిహెచ్‌సిలో రోగులకు పాలు, రొట్టెలను మంగళవారం ఆసుపత్రి సూపరెంటిండెంట్ జనార్ధన్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. సత్యసాయి జయంతి ఉత్సవాల్లో భాగంగా రోజుకొక సేవా కార్యక్రమం నిర్వహిస్తున్నామని భజన మండలి సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో భజన మండలి సభ్యులు కక్కిరాల సురేష్, భగవాన్, విశ్వేశ్వరరావు, కిరణ్ , నానాజీ, త్రినాధ్, టైపు మాస్టర్ నవర నూకరాజు శర్మ పాల్గొన్నారు.

షేక్ జిలానీకి అభినందన

ప్రతిజ్ఞ చేస్తున్న కొత్త కమిటీ సభ్యులు

ప్రజాశక్తి నర్సీపట్నం టౌన్ : ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా కమిటీని నియమించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శిగా స్థానిక రిటైర్డ్ ఉద్యోగి షేక్ జిలాని నియమించారు. ఈ సందర్భంగా నర్సీపట్నంలో ప్రజా సంఘాలు, ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తం చేశారు. కమిటీ నియామకంలో రామకృష్ణారెడ్డి, కె.ప్రసాద్, సన్యాసిరావు, వైమాకి రెడ్డి, జిల్లా అధ్యక్షులు కెవి రమణ పాల్గొన్నారు.

అధికారులకు సత్కారం

ప్రజాశక్తి- నక్కపల్లి : మండలంలోని ఉపమాక గ్రామంలో దుర్గాభవానీ గురు పీఠాన్ని మంగళవారం ఎంపిడిఒ డి. సీతారామరాజు, ఇఒపిఆర్‌డి వెంకట నారాయణ దర్శించుకున్నారు. అమ్మవారి నిత్యపీఠం ఎంతో అద్భుతంగా వుందని వారు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా గురుభవానీ దవరసింగి రాంబాబు అమ్మవారి శేష వస్త్రాలతో వారిని సత్కరించి, అమ్మవారి చిత్రపటాలను బహూకరించారు.

అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న రాంబాబు

నల్లరాయి క్వారీల పర్యావరణ అనుమతులకు..

26న గ్రామసభలను రద్దుచేయాలి

మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-రోలుగుంట : నల్లరాయి క్వారీల పర్యావరణ అనుమతుల కోసం గ్రామసభలు తక్షణమే రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు, రోలుగుంట మండల కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి జిల్లా కలెక్టర్ రవిపఠాన్‌శెట్టికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. అనకాపల్లి జిల్లా రోలుగుంట మండల కేంద్రం నిండుగొండ, కొవ్వూరు గ్రామ పంచాయతీ పరిధిలో పదివేల మంది జనాభా ఉన్నారన్నారు. ఈ గ్రామాలు ఫ్లోరైడ్ గ్రామాలుగా గుర్తించి నేటికీ 14ఏళ్లు గడుస్తున్నా సురక్షిత నీటి సరఫరాకు ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. సంవత్సరాలు అవుతుందని, 2008లో రూ.మూడు కోట్లతో వరాహనది నుండి గొట్టం బావుల ద్వారా రోలుగుంట మండల కేంద్రం మీదుగా 11 గ్రామాలకు నీరు సరఫరా చేస్తున్నారన్నారు. వర్షాకాలం వస్తే గెడ్డలో బురద నీరు సరఫరా అవుతుందన్నారు. ఎండాకాలం వస్తే వారానికి రెండుసార్లు కూడా నీరు సరఫరా జరగడం లేదన్నారు. మండల కేంద్రంలో రూ.26 లక్షలతో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి, పుష్కరమైనా నేటికీ వినియోగంలోకి తీసుకు రాలేదన్నారు. నిండుగొండ, కొవ్వూరు, రోలుగుంట గ్రామాల్లో 2009లో నల్లరాయి క్వారీలు ప్రారంభించారని, నేడు 30 నల్లరాయి క్వారీలు ఏర్పాటు చేశారన్నారు. నేటికీ 13 ఏళ్లు గడిచినా పర్యావరణ శాఖ కన్నెత్తి చూడలేదన్నారు. కొండ పక్కన ఉన్న గడ్డలు అన్ని కూడా కప్పేసి, దుమ్ము ధూళితో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నా, మామూళ్ల మత్తులో ఉన్న మైనింగ్‌శాఖ పట్టించుకోవడం లేదన్నారు. పర్యావరణ నిబంధనకు విరుద్ధంగా నిర్వహిస్తున్న క్వారీలపై చర్యలు తీసుకోవాలని కోరారు. నిబంధలనకు విరుద్ధంగా భారీ బ్లాస్టింగ్‌లతోపాటు, భారీ వాహనాల రాకపోకలతో దుమ్ముధూళిరేగి శ్వాసకోశ వ్యాధుల బారిన పడి ప్రజలు అల్లాడుతున్నా ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు. క్వారీలారీలతో పాడౌతున్న బిఎన్‌రోడ్డు దుస్థితిపై దృష్టి సారించాలని కోరారు.. ఈ పరిస్థితుల్లో ఈ నెల 26వ తేదీన నిండుగొండ, రోలుగుంట, శరభవరం గ్రామాల్లో మూడు క్వారీలకు పర్యావరణ అనుమతులు కోసం గ్రామ సభలు నిర్వహిస్తున్నారన్నారు. తూతూ మంత్రంగా గ్రామ సభలు నిర్వహించడాన్ని సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు.

బస్ సౌకర్యం పునరుద్ధరించండి

ప్రజాశక్తి - రావికమతం : రావికమతం నుంచి కింతలి మీదుగా మాడుగులకు బస్సు సౌకర్యం లేక ఈ ప్రాంత ప్రజలు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాలుగేళ్ల క్రితం నర్సీపట్నం డిపో నుంచి నర్సీపట్నం వయా రావికమతం కింతలి మీదుగా మాడుగులకు ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉండేది. ఈ బస్సును నర్సీపట్నం డిపో నిలిపేయడంతో ఈ ప్రాంత ప్రజలు అవస్థలు పడుతున్నారు. స్థోమత ఉన్నవారంతా బైకులు కొనుక్కోగా, అనేక మంది ఆటోలు, వ్యాన్లు, ఇతర ప్రైవేటు వాహనాల ద్వారా అవస్థలు పడుతూ, అధిక మొత్తంలో ఛార్జీలను మండల కేంద్రానికి, జిల్లా కేంద్రాలకు పనుల నిమిత్తం నరకయాతన పడుతూ వెళ్ళవలసి వస్తోందని వాపోతున్నారు.

రావికమతం నుంచి మాడుగుల వరకు తిరిగే ఈ బస్సు రావికమతం ,గుమాలపాడు, చినపాచిల, పెదపాచిల, ఎర్రబంద ,కొమీర,కేబీపీ అగ్రహారం, కవగుంట, బుడ్డి బంద, శివరాంపురం ,పొంగలిపాక, కింతలి, జమ్మా దేవిపేట, వొమ్మలి, గాదిరాయి, జంపిన, వాటర్ పాడు, ఘాట్ రోడ్డు మీదుగా మాడుగుల వరకు అనేక గ్రామాల ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉండేది. ఈ బస్సు రద్దుతో ప్రజలు పడుతున్న ఇబ్బందులపై గుమ్మాలపాడు సర్పంచ్ బంటు సన్యాసినాయుడు, కేవీపీ అగ్రహారం సర్పంచ్ కలిగిరి ప్రసాద్, కవగుంట సర్పంచ్ దాసరి వరహాలుతోపాటు పలు గ్రామ పంచాయతీల సర్పంచులు ప్రజా ప్రతినిధులు పలుమార్లు ఆర్టీసీ అధికారులకు వినతులు ఇచ్చినప్పటికీ ఫలితం లేదు.

మారుమూల గ్రామాలకు సైతం రవాణా సౌకర్యం కల్పించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం పనిచేస్తుందని చెప్తున్న మాటలకు, ఇక్కడ అమలుకు పొంతన లేదని, ప్రభుత్వ లక్ష్యాన్ని ఆర్‌టిసి అధికారులు తూట్లు పొడుస్తున్నారని పలు గ్రామాల సర్పంచ్, ప్రజా ప్రతినిధులు, ఈ ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రజల సౌకర్యార్థం ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి మాడుగుల, రావికమతం బస్సును పునరుద్ధరించాలని కోరుతున్నారు. అధికార్లు స్పందించకుంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి -ఆనందపురం: చిల్డ్రన్స్ డే సందర్భంగా ఐద్వా ఆధ్వర్యాన శ్రమజీవుల కాలనీలో నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు మంగళవారం బహుమతులు అందజేశారు. ఐద్వా నాయకులు కె.నాగరాణి ఆధ్వర్యాన పిల్లలకు లెమన్ స్పూన్, కుర్చీ ఆట, కప్పగింతలు, రుమాలాట తదితర పోటీలు నిర్వహించారు. గెలుపొందిన పిల్లలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు కె.లావణ్య, కె.రాజి, పూజిత, దేవి, మీనా, చాణక్య తదితరులు పాల్గొన్నారు.

కరాస: వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యాన నవంబర్ 14న చిల్డ్రన్స్ డే, వరల్డ్ ఇంట్రాక్ట్ వీక్స్ సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు రోటరీ క్లబ్, విమాన నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విమాననగర్‌లో మంగళవారం బహుమతులు అందజేశారు. ఈ మేరకు రోటరీ క్లబ్ డిస్టిక్ గర్ల్ ఎంపవర్‌మెంట్ చైర్మన్ అంబిక మెడల్స్, సర్టిఫికెట్ అందజేశారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఇలాంటి పోటీలు పిల్లల్లో శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చటానికి, వారిలోని సృజనాత్మకతను వెలికి తీయటానికి దోహదపడతాయని తెలిపారు. ఈ పోటీల్లో దాదాపు 130 మంది పిల్లలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విసిసి డిస్టిక్ సెక్రెటరీ అజయ్, జాయింట్ సెక్రెటరీ రోషన్, కో-ఆర్డినేటర్ లీలా, ఐద్వా నాయకులు ప్రభావతి, విమాన్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, నాగ, పిఎస్‌ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి పాలన అవినీతిమయం

ప్రజాశక్తి- పాయకరావుపేట : వైసిపి పాలనలో ఆంధ్రాను అవినీతి రాష్ట్రంగా తయారు చేశారని జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివ దత్త ఆరోపించారు. సిఎం జగన్ అరాచక పాలనలో మత్స్యకారులు భవన కార్మికులు బడుగు బలహీన వర్గాల ప్రజలను నెట్టేట ముంచేసారని ఆరోపించారు రాష్ట్రంలో గృహ నిర్మాణాలలో అవినీతి అక్రమాలు రాజ్యమేలుతున్నాయన్నారు. జగనన్న ఇల్లు, జగనన్న లేఅవుట్లు పేదల కన్నీళ్లుగా తయారయ్యాయని ఆరోపించారు.

విద్యుత్ ప్రమాదాలపై 25న అవగాహన

ప్రజాశక్తి నర్సీపట్నం టౌన్ : విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్న నేపధ్యంలో ఇళ్లలో వైరింగ్ చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఈ నెల 25న నర్సీపట్నలో ఎలక్ట్రిషియన్లతో సమావేశం నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో ఇఇ సురేష్‌బాబు తెలిపారు. ఇళ్లలో విద్యుత్ మీటర్లను కొందరు మేకులకు వేలాడదీయడం, సర్వీసు వైర్లు భవనాలను తాకేలా ఉంచడంతో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగి, ప్రాణ, ఆస్తినష్టాలు సంభవిస్తుంటాయి. చిన్నపాటి నిర్లక్ష్యం కారణంగా సంభవించే పెను ప్రమాదలను నివారించడమే లక్ష్యంగా ప్రజలకు ముందస్తు జాగ్రత్తలపై అవగాహనకు ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అగ్ని ప్రమాదాలకు కారణమైన విద్యుత్ తీగలు, సిలిండర్లు, అగ్ని మిరుగుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదాల నివారణకు ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తామన్నారు.

మురుగు నీటితో అవస్థలు

డ్రైనేజీ లేక రోడ్డుపై నిల్వ ఉన్న నీరు

ప్రజాశక్తి-రోలుగుంట : మండలంలో రత్నంపేట గ్రామంలో డ్రైనేజీ లేక రోడ్డుపైనే నీరు నిల్వ ఉంటుందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు రెండువైపులా కాలువలు లేకపోవడం వల్ల వాడుతున్న నీరు రోడ్డు మీదే నిల్వ ఉంటుంది. ఈ కారణంగా రోడ్డు గోతులు పడటమే కాకుండా దోమలకు ఆవాసంగా మారి రోగాల బారిన పడుతున్నామని ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి , రోడ్డు మధ్యలో నీరు నిల్వ లేకుండా చేయాలని, ఇరువైపులా డ్రైనేజీ నిర్మించాలని కోరుతున్నారు.

వైస్ ఎంపిపికి మాతృవియోగం

ప్రజాశక్తి -కోటఉరట్ల : స్థానిక మండల పరిషత్ ఉపాధ్యక్షులు దత్తుడురాజు కన్నతల్లి, మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణ రాజు అత్తగారు, రాజా సాగి బుచ్చి వెంకయ్యమ్మ (84) మంగళవారం మృతి చెందారు. ఈమె పెద్ద కుమారుడు సత్యనారాయణ రాజు గతంలో మండల వైస్ ఎంపిపిగా వ్యవహరించగా, దత్తుడు రాజు ఈమెకు రెండవ కుమారుడు. ఈయనను మాజీ మంత్రి సూర్యనారాయణ రాజు దత్తత తీసుకున్నారు. వెంకయ్యమ్మ మృతి పట్ల స్థానిక ఎమ్మెల్యే గొల్ల బాబురావు సహా పలువురు నాయకులు సంతాపం వ్యక్తం చేసి, తంగేడు గ్రామంలో కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

తాగునీటి సరఫరా పనుల పరిశీలన

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న భారీ మంచినీటి పథకం పనులను ఎషియన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్మెంట్ బ్యాంక్ చీఫ్ కన్సల్టెంట్ డాక్టర్ డిఎం.మోహన్ పరిశీలించారు. ఈ పథకానికి సంబంధించి కోటవురట్ల మండలం ఎండపల్లి వద్ద జరుగుతున్న ఏలేరు కాలువ పనులను ముందు పర్యవేక్షించారు. అనంతరం బలిఘట్టం వద్ద ఎనిమిది లక్షల లీటర్ల కెపాసిటీ గల ట్యాంక్ నిర్మాణ పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనులు చేయాలన్నారు.కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ రాజారావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బాబు, డి. మహేష్ పాల్గొన్నారు.

వైభవంగా పల్లకి సేవ

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: స్థానిక పెద్ద చెరువు వద్ద ఉన్న అన్నపూర్ణ విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వర స్వామి పల్లకి సేవ ఘనంగా నిర్వహించారు. పల్లకిసేవలో మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు సతీమణి మున్సిపల్ కౌన్సిలర్ చింతకాయల పద్మావతి పాల్గొన్నారు. ఆలయం నుంచి గొర్లి వీధి, ఐదు రోడ్ల జంక్షన్, కృష్ణ బజార్, అబిద్ సెంటర్, పాత బస్టాండ్ వీదులలో పల్లకి ఊరేగించారు ఆలయ అర్చకులు బి జగదీష్ శర్మ నిత్య అన్నదాన ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి భక్తులకు అన్నదానం చేస్తున్నారు. కురచ అప్పలనాయుడు, కురచ సత్య నారాయణ, కురచ చిట్టిబాబు తమటపు ప్రసాదు పాల్గొన్నారు.

మంత్రి కిషన్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు

ఉక్కు దీక్షాశిబిరం వద్ద భారీగా మోహరించిన పోలీసులు

భారీగా మోహరించిన పోలీసులు

ప్రజాశక్తి-ఉక్కునగరం : కేంద్ర పర్యాటక మంత్రి కిషన్ రెడ్డి పరవాడలోని ఎన్‌టిపిసి పర్యటన నేపథ్యంలో కూర్మన్నపాలెం జంక్షన్‌లో వందలాది మంది పోలీసులు స్టీల్‌ప్లాంట్ కార్మికుల దీక్షా శిబిరం చుట్టూ మోహరించారు. దీక్షా శిబిరం నుంచి హైవేకు రానివ్వకుండా అడ్డుకున్నారు. కేంద్ర మంత్రి కాన్వాయ్ వెళుతున్న సమయంలో దీక్షా శిబిరంలో ఉన్న కార్మికులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు, గో బ్యాక్ కిషన్‌రెడ్డి, బిజెపి హటావో దేశ్ బచావో, ఆంధ్రుల గుండె చప్పుడు విశాఖ ఉక్కు అని, పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పోలీసులు రెండు వ్యాన్లలో కూర్మన్నపాలెం చేరుకున్నారు. అరెస్టులు చేయడానికి సైతం సిద్ధపడ్డారు. కానీ ఆ సమయంలో దీక్షా శిబిరంలో కార్మికులు తక్కువ సంఖ్యలో ఉండటంతో పోలీసులు వారిని కట్టడి చేశారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు వరసాల శ్రీనివాసరావు, గుమ్మడి నరేంద్ర, కోరాడ వెంకట్రావు, సిహెచ్ సన్యాసిరావు, ఆకుల నూకరాజు, కొమ్ము ప్రసాద్, దేవుడు నాయుడు, పల్లా పెంటారావు, ప్రసాద్, రాజు, శ్రీనివాస్ తదితరులు నినాదాలు చేశారు.

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన దీక్షలకు మంగళవారం నాటికి 649వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో ప్లాంట్ సిఐసిసిపి విభాగ కార్మికులు కూర్చున్నారు. దీక్షనుద్దేశించి పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, వరసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ, విశాఖ ఉక్కు పరిరక్షణకు ఇంత పెద్ద పోరాటం జరుగుతుంటే రాష్ట్రంలో ఉన్న రాజకీయ పార్టీలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దుర్మార్గమన్నారు. వచ్చే ఎన్నికల్లో ఏ అంశాల ప్రాతిపదికన ప్రజలను ఓట్లు అడుగుతారో తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ప్రజల ఆకాంక్షలు గాలికి వదిలేసి నరేంద్ర మోడీ భజన చేయడం పరిపాటిగా మారిందని విమర్శించారు. రాష్ట్ర అభివృద్ధిలో భాగమైన విభజన హామీలు, రైల్వే జోన్, పోలవరం ప్రాజెక్టు, విశాఖ ఉక్కు వంటి ప్రధాన అంశాలను సాధించడంలో ద్వంద విధానాలతో ఒంటెద్దు పోకడలు పోతూ రాష్ట్రప్రభుత్వం ప్రజలకు తీరని ద్రోహం చేస్తుందన్నారు. వీరికి తగిన గుణపాఠం చెప్పే రోజు వస్తుందన్నారు. రానున్న కాలంలో లక్షలాది మంది కార్మికులు, కర్షకులు, నగర పౌరులతో సమావేశం నిర్వహించి, విశాఖ ఉక్కు ప్రభుత్వ రంగంలో కొనసాగింపుపై విశాఖ డిక్లరేషన్ చేసేందుకు ప్రజలను చైతన్యవంతులను చేసే విధంగా కార్మిక సంఘాలు కృషి చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో విభాగం కార్మికులు గుమ్మడి నరేంద్ర, డి.శ్రీనివాస్, కోటేశ్వరరావు, దేవీప్రసాద్ గోపాల్ రాజు, ఆకుల నూకరాజు, కొమ్ము ప్రసాద్, దేవుడు నాయుడు ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'కనోసా' విద్యార్థుల ప్రతిభ

బహుమతులతో కనోసా పాఠశాల విద్యార్థులు

ప్రజాశక్తి- పాయకరావుపేట: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో స్థానిక కనోస ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు ప్రతిభను చాటి వివిధ అంశాల్లో ప్రథమ స్థానంలో నిలిచారు. పలు పోటీల్లో ఎం దేవిశ్రీ ప్రథమస్థానంలో నిలవగా, వ్యాసరచన పోటీల్లో ఎం.ధన్య, ఎం దీక్ష, ఎం కీర్తన, మెం లిసా, ప్రథమ ద్వితీయ తతీయ స్థానాల్లో నిలిచి బహుమతులను సాధించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కనోస పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ సోఫియా మంగళవారం అభినందించారు. కార్యక్రమంలో సిస్టర్ సోఫియా, పిఇటి శ్రీను, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

క్రీడాకారిణి ప్రియాంకకు ఆర్థిక ప్రోత్సాహం

ప్రియాంకను అభినందిస్తున్న ఎమ్మెల్యే గణేష్

ప్రజాశక్తి - నర్సీపట్నం టౌన్ : నేషనల్ రెజ్లింగ్ గ్రాప్లింగ్ ఛాంపియన్ షిప్ పోటీలకు ఎంపికై వేపాడ ప్రియాంకను స్థానిక ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అభినందించి, ఆర్థిక ప్రోత్సాహాన్ని అందించారు. . ఉత్తరప్రదేశ్ అయోధ్య స్పోర్ట్స్ స్టేడియంలో ఈనెల 25 నుంచి 28 వరకు జరగనున్న నేషనల్ రెజ్లింగ్ గ్రాప్లింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో 70కిలోల విభాగంలో ప్రియాంక పోటీ పడనుంది. నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫైనల్ ఇయర్ చదువుతూ హాస్టల్‌లో చదువుకుంటూ నింజాస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న ప్రియాంక నేషనల్ పోటీలకు ఎంపికయ్యేందుకు అవసరమైన విక్షణను కోచ్ శేఖర్ ఆధ్వర్యంలో తీసుకుంది. నేషనల్ పోటీలకు వెళ్తున్న విద్యార్థి వేపాడ ప్రియాంకను ఛైర్మన్ వెలగా నారాయణరావు అభినందించారు. ప్రియాంక జాతీయపోటీలకు ఎంపికైన వాటిల్లో పాల్గొనేందుకు ఆర్థికస్థోమత లేదని కోచ్ శేఖర్ ద్వారా తెలుసుకుని సాయమందించి ఎమ్మెల్యే మాట్లాడుతూ, క్రీడాకారులను ప్రోత్సాహించడం అందరి బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే గణేష్, వెలగ నారాయణరావులకు నింజాస్అకాడమీ డైరెక్టర్స్, విద్యార్థులుకతజ్ఞతలు తెలియజేశారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్

వివిధ సైన్స్ ప్రాజెక్టులతో వెంకటాపురం విద్యార్థులు

ప్రజాశక్తి -కోటఉరట్ల : మండలంలోని వెంకటాపురం జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయులు కె.వి నాగేశ్వరరావు మాట్లాడుతూ, విద్యార్థులు అన్ని రంగాల పట్ల దష్టి సారించాలని సూచించారు. ఎగ్జిబిషన్‌లో ప్రతిభ చూపిన పలువురు విద్యార్థులను అభినందించారు. సైన్స్ ప్రాజెక్టులో ప్రతిభ చూపడం ద్వారా మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో పతకాలను సాధించాలని ఆకాంక్షించారు.

త్వరితగతిన ప్రభుత్వ భవనాల నిర్మాణం

నక్కపల్లిలో భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న జెడ్‌పి సిఇఒ

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలోని వేంపాడులో సచివాలయం ,రైతు భరోసా, హెల్త్ క్లినిక్ భవన నిర్మాణ పనులను, సంపద తయారీ కేంద్రాలను మంగళవారం జెడ్‌పి సిఇఒ శ్రీరామమూర్తి పరిశీలించారు. సకాలంలో భవన నిర్మాణాలు పూర్తిచేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు .భవనం ఆవరణంలో మొక్కలు నాటాలని సూచించారు.
.అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ సీతారామరాజుతో సమావేశమై, పంచాయతీల్లో చేపడుతున్న అభివృద్ధి పనులపై అడిగి తెలుసుకున్నారు. జెడ్‌పిటిసి గోసల కాసులమ్మ, మండల పరిషత్ ఉపాధ్యాయులు వీసం నానాజీ తదితరులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. మండల విద్యాశాఖ కార్యాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని ,వర్షం పడినప్పుడల్లా ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఎంఇఒ డివిడి ప్రసాద్ సమస్యను సిఇఒ దృష్టికి తీసుకువెళ్లారు. సభ్యులతో మాట్లాడి ఆర్థిక సంఘం నిధులతో మరమ్మత్తు పనులు చేపట్టే విధంగా చర్యలు చేపట్టాలని ఎంపిడిఒకు సూచించారు. జలజీవన్ మిషన్ పనుల పురోగతిపై ఆరా తీసి త్వరితగతిన చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి వెంకటనారాయణ, పంచాయతీ కార్యదర్శులు రాజశేఖర్, శ్రీను ,బాబురావు ,కిరణ్, నర్సింగరావు పాల్గొన్నారు.

కోటఉరట్ల: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ సక్రమంగా అందజేయాల్సిన బాధ్యత అధికారులదేనని జిల్లా పరిషత్ సిఇఒ శ్రీరామమూర్తి అన్నారు మంగళవారం మండలంలో పలు అభివృద్ధి పనులను పరిశీలించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలకు రూ.18కోట్ల జిల్ల పరిషత్ నిధులు మంజూరయ్యాయని, మండలానికి కేటాయించిన రూ.15లక్షలతో సకాలంలో అవసరమైన పనులు చేపట్టాలని సూచించారు. జెడ్‌పిటిసి ఉమాదేవి, ఎంపిడిఒ చంద్రశేఖర్, పిఆర్ జెఇ వర్మ,పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలుపై ఆరా

మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మశ్రీ

ప్రజాశక్తి-రోలుగుంట : ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత సీఎ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని చోడవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. మంగళవారం మండలంలోని జె.నాయుడుపాలెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అమలుకు ఇప్పటికే రూ.1.73 కోట్లు ఖర్చు చేశారన్నారు.. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. ఇంకా అర్హులై ఉండి ఎవరికైనా సంక్షేమ పథకాలు అందకపోతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు మడ్డు అప్పలనాయుడు, ఎంపిపి యర్రంశెట్టి శ్రీనివాసరావు, సర్పంచ్ బగుడు రమణ, వైసిపి మహిళా విభాగం మండలశాఖ అధ్యక్షురాలు జెర్రిపోతుల రామలక్ష్మీ, వైస్ ఎంపిపి కొల్లు సన్యాసినాయుడు, బిసి కార్పొరేషన్ డైరెక్టర్ టివి.రమణ, తహశీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంపిడిఒ ప్రభాకరరావు, ఎఇ ప్రేమానందం, ఈఒపిఆర్‌డి మల్లికార్జునరావు, ఎఒ విజయలక్ష్మీ పాల్గొన్నారు.

గడ్డ కట్టిన సిమెంట్‌తో 'నాడు - నేడు' పనులు

నిర్మాణ పనుల్లో నాణ్యతాలోపం.. పట్టించుకోని అధికారులు

గడ్డలు కట్టిన సిమెంట్ బస్తాలు

పాడైన సిమెంట్‌ను నిర్మాణ పనుల్లో వాడుతున్న వైనం

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని మేజర్ పంచాయతీ ఎఎల్‌పురంలో చేపడుతున్న నాడు నేడు పనులకు ప్రభుత్వం సరఫరా చేసిన వివిధ కంపెనీల సిమెంట్ బస్తాలు వందల సంఖ్యలో గడ్డలు కట్టుకుపోయాయి. పాడైన ఈ సిమెంట్‌తోనే పనులు కొనసాగిస్తున్నారు. ఈ పనులలో నాణ్యత లోపం దర్శనమిస్తుంది. అంతేకాకుండా పనులు దగ్గరుండి పర్యవేక్షించాల్సిన సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా ఎఎల్‌పురం హైస్కూల్, ఎంపిపి స్కూల్, జూనియర్ కళాశాల పనులలో ఈ సిమెంట్‌ను ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. అలాగే ఏఎల్‌పురం ఎంపిపి స్కూల్లో 281 బస్తాలు గత ఆగస్టులో ఇవ్వగా, 193 బస్తాలు ఉపయోగించి, 88 బస్తాలు నిరుపయోగంగా గడ్డలు కడుతున్నాయి. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి నాణ్యమైన సిమెంట్‌ను తెచ్చి నిర్మాణాలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. తగు చర్యలు చేపట్టకపోతే జిల్లా కలెక్టర్‌కుఫిర్యాదు చేస్తామని తెలిపారు.

వినికిడి యంత్రం పంపిణీ

వినికిడి యంత్రాన్ని అందజేస్తున్న శివప్రసాద్

ప్రజాశక్తి- గొలుగొండ :మండలంలోని కృష్ణదేవి పేట గ్రామానికి చెందిన అప్పారావు వినికిడి సమస్యతో బాధపడు తున్నాడు. 'నేను సైతం' చారిటబుల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు శివప్రసాద్ సంప్రదిస్తే అప్పటికప్పుడు స్పందించి బాధితుడికి వినికిడి యంత్రాన్ని మంగళ వారం అందజేశారు. ఈ సందర్భంగా శివ ప్రసాద్ మాట్లాడుతూ గతంలో అనేక సేవా కార్యక్రమాలు నేను సైతం ఛారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించామని, భవిష్యత్తులోనూ కొనసాగిస్తామని శివప్రసాద్ తెలిపారు.